


చిలకలూరిపేట మేజర్ కాలువ

- సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం
- 14న నీటి సంఘాలకు.. 17న డీసీలకు ఓటింగ్
- ఏర్పాట్లలో అధికారులు.. నాయకుల సమాయత్తం

ఎట్టకేలకు ఎన్నికలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో ఊసెత్తని.. కూటమి ప్రభుత్వ హయాంలో రెండు సార్లు వాయిదా పడిన.. సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. గ్రామాల్లో ఒక వైపు రైతులు వరి కోతల హడావుడిలో ఉండగా మరోవైపు ఎన్నికల సమరానికి తెరలేచింది. దీంతో పల్లెల్లో నీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. ఈ నెల 14న నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ)కు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల(డీసీ)కు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు జలవనరుల, రెవెన్యూ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సాగు నీటి సంఘాల వారీగా అధికారులను నియమించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక నీటి సంఘాలను గుర్తించారు. వీటి ఎన్నికలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను అధికారులు ఇప్పటికే కోరారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వాయిదాల అనంతరం ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలతో రాజకీయ పార్టీలకు చెందిన గ్రామ నాయకులు ఎన్నికలపై దృష్టి సారించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బందికి శిక్షణను పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని కూడా సిద్ధం చేశారు. ఎన్నికలను అధికార పార్టీ ప్రతిష్ఠాత్మకంగా స్వీకరించింది. సేవా భావం కలిగిన వారిని నీటి సంఘాలకు ఎన్నుకోవాలని ఇప్పటికే కూటమి నేతలు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలపై వైసీపీ దృష్టి సారించిన దాఖలాలు లేవు.

సాగర్ పరిధిలో 274 నీటి సంఘాలు

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్‌లో 274 సాగు నీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 12 టీసీల చొప్పున మొత్తం 2,628 టీసీలు ఉన్నాయి. టీసీల వారీగా ఓటర్ల జాబితాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. టీసీలకు 14న ఎన్నికలు జరగనుండగా అదే రోజున సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 17న ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రాజెక్టు కమిటీ ఎన్నికల తేదీని ప్రకటించాల్సి ఉంది. కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. నీటి పంపిణీలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1, 2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.



- గంటల కొద్దీ ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు
- గమ్యస్థానం చేరే సమయంపై అయోమయం
- రోజువారీ ప్రయాణికులు, ఉద్యోగులు పడరానిపాట్లు
- ఇష్టారాజ్యంగా రైళ్ల రద్దు.. అరకొర రైళ్లపై తీవ్ర ఒత్తిడి

రైలు ప్రయాణం నరకం



గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు వస్తాయో తెలియదు.. ఎప్పుడు బయల్దేరతాయో అర్థం కాదు.. ఇదీ ప్రస్తుతం రైళ్ల పరిస్థితి. గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు.. ఆ రైళ్లలో ఎక్కి ఎప్పటికి గమ్యస్థానానికి చేరుతామో తెలియదు.. ఇదీ ప్రయాణికుల కష్టాలు. ఇష్టం వచ్చినట్లు రైళ్లను రద్దు చేస్తున్నారు.. అయినా రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం. ఒకప్పుడు సమయానికి వచ్చి సమయానికి గమ్యస్థానాలకు చేర్చుతూ ప్రయాణికుల ఆదరణను పలు రైళ్లు పొందాయి. అయితే గత కొంతకాలంగా రైళ్ల రాక.. పోక అనేది ఎవరికీ తెలియడంలేదు. రైల్వే అధికారులు కూడా రైళ్ల రాకపోకల గురించి చెప్పలేకపోతున్నారు. తాను ఎక్కబోయే రైలు జీవితకాలం లేటు అన్న నానుడిని నిజం చేసేలా ప్రస్తుతం రైలు ప్రయాణం మారింది. రైలులో ప్రయాణం అంటే కోరుకుని నరకానికి ప్రయాణం కట్టినట్లే అన్నట్లుగా మారింది పరిస్థితి. సీజన్‌పై రోజువారీ ప్రయాణాలు చేసే ఉద్యోగులు, విద్యార్థుల పరిస్థితి గురించి చెప్పాలంటే అది నిత్య నరకమే. గుంటూరు నుంచి పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ, బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె రూట్లలో నడిచే రైళ్లు, పక్క జిల్లాల్లోని విజయవాడ, నరసాపురం రూట్లలో నడిచే రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి.

పదుల కిలోమీటర్లు.. గంటల ప్రయాణం

గుంటూరు నుంచి విజయవాడ మధ్య దూరం 30 కి.మీ. కాగా అందుకోసం 2 నుంచి 3 గంటల సమయం పడుతున్నది. 120 కి.మీ దూరం ఉన్న గుంటూరు- మాచర్ల మధ్య ప్రయాణం 4 నుంచి 6 గంటల సమయం పడుతోంది. సాయంత్రం 7.35కు గుంటూరు చేరుకోవాల్సిన మాచర్ల రైలు ఈ వారంలో రెండు రోజులు రాత్రి 10.30 వరకూ గుంటూరుకు రాలేదు. ఒకటి రెండు రోజులు మినహా మిగిలిన అన్ని రోజులూ ఆ రైలు ఆలస్యంగా వస్తోంది. దీంతో ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. హుబ్లీ రైలు ఈ నెల 6న రాక, పోకలు రెండూ ఐదు గంటలు ఆలస్యంగా సాగాయి. గుంటూరు- విజయవాడల మధ్య తిరిగే ఇంటర్‌సిటీ మెమూ రైళ్లు రెండు మూడు గంటల సగటు జాప్యంతో తిరుగుతున్నాయి. గడిచిన నాలుగు రోజులుగా 30 కి.మీ ప్రయాణానికి ఈ రైళ్లు 4 గంటల సమయం తీసుకుంటున్నాయి. ఉదయం 11.30కి గుంటూరులో బయలుదేరి

(మిగతా 8వ పేజీలో)

మిర్చియార్డు చైర్మన్.. మళ్లీ ఓసీకే 8
- కలెక్టర్ ఆమోదంతో త్వరలో గెజిట్ నోటిఫికేషన్

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పెరగనున్న జనరల్ బోగీలు

కృత్రిమ మేధ ద్వారా విస్తృత పరిశోధనలు 6
రెండు రోజుల జాతీయ సదస్సులో ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు


గుంటూరు కేవీపీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

- నాడు-నేడు పేరు మార్పుతో సరి
- పాఠశాలల్లో పునః ప్రారంభంకాని పనులు
- పాడైపోతున్న నిర్మాణ సామగ్రి.. ప్రజాధనం వృథా
- అటకెక్కిన అభివృద్ధి పనులపై దృష్టి సారించని పాలకులు
- నిధులు విడుదల కాక గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా పనులు

గుంటూరు కేవీపీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

ఆరునెలలైనా.. అసంపూర్తిగానే

ప్రభుత్వ పాఠశాలలను నాడు- నేడు పేరుతో తీర్చిదిద్దుతున్నామన్నారు.. కార్పొరేట్ పాఠశాలకంటే మిన్నగా మారుస్తామన్నారు.. తొమ్మిది రకాలు పనులు చేపట్టారు.. వందల్లో పాఠశాలలను ఎంపిక చేసి రూ.కోట్లలో నిధులు మంజూరు చేశారు.. ఉన్న భవనాలను పడగొట్టారు.. అయితే నిధులు విడుదల చేయకుండా పాఠశాలలను గత పాలకులు పాడుబెట్టారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల దుస్థితిని చూసి, వాటిని సరిదిద్దేందుకు సంకల్పించింది. తొలుత నాడు-నేడు పేరును మనబడి మన భవిష్యత్తుగా మార్చింది. దీంతో అటకెక్కిన పనులు ప్రారంభమవుతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా భావించారు. కానీ ఆరు నెలలుగా అసంపూర్తిగానే పనులు ఉన్నాయి.

గుంటూరు(విద్య), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం గత ప్రభుత్వం నాడు నేడు పథకం పేరుతో ప్రారంభించి వదిలేసిన పనులు ఇప్పటికీ అనేక చోట్లు అలాగే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం పథకం పేరును మార్చడంతో సరిపెట్టిందే కానీ పనుల పునః ప్రారంభంపై దృష్టి సారించలేదు. పనులపై రాష్ట్రస్థాయిలో సమీక్ష నిర్వహించక పోవడంతో జిల్లా స్థాయిలో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయని తెలుస్తోంది. ఫలితంగా నిర్మాణ సామగ్రి అనేక చోట్లు పాడైపోతోంది. కొన్ని చోట్ల దొంగల పాలౌతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పెండింగ్‌లోనే అభివృద్ధి పనులు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో చేపట్టిన పనులు ప్రభుత్వం మారినా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, తాగునీటి కోసం వాటర్ ప్లాంట్స్ గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబులు, కిచెన్‌షెడ్లు, సైన్స్ ల్యాబుల నిర్మాణం, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్ సౌకర్యం, రంగులు వేయడం తదితర తొమ్మిది రకాల పనుల్ని చేపట్టగా ఆయా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. గత ప్రభుత్వం నాడు నేడు పథకంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2 వేలకుపైగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు జడ్పీ పాఠశాలల్ని ఎంపిక చేసి దాదాపు రూ.వెయ్యి కోట్లకుపైగా బడ్జెట్ కేటాయింపులు చేసింది. కానీ నిధుల విడుదల మాత్రం 40 శాతం కూడా చేయలేదు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటికీ 45 శాతంపై పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. వందల సంఖ్యలో భవన నిర్మాణ పనులు ఇంకా వివిధ దశల్లోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పునాదుల స్థాయిలో మరికొన్ని చోట్ల శ్లాబ్ పూర్తి అయినా పార్టీషన్, ప్లాస్టింగ్, విద్యుత్, ప్లంబింగ్ పనులు పూర్తికాలేదు. నిర్మాణ సామగ్రి అనేక చోట్ల పాడైపోతోంది. ఇసుక, కంకర, డస్ట్ ఇప్పటికే అనేక పాఠశాలల్లో మట్టిలో కలిసిపోయింది. సిమెంట్‌కు రక్షణ లేకపోవడంతో గడ్డకట్టి ఉపయోగించడానికి వీలులేకుండా మారింది. శానిటరీ, ప్లంబింగ్, విద్యుత్ పరికరాలు తరగతి గదుల్లో పేరుకుని పోయి ఉన్నాయి. కొన్ని ఇప్పటికే ధ్వంసం కాగా, మరికొన్ని దొంగలపాలైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాగా మారిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అనేక పాఠశాలల్లో తాగునీటి పథకాల ఏర్పాటు చేసినా వినియోగంలోకి రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అసంపూర్తి పనులపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.


గుంటూరులోని ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో గడ్డకట్టి పాడైపోయిన సిమెంట్ బస్తాలు

జోరుగా టీడీపీ సభ్యత్వాలు

- ప్రథమ స్థానంలో వినుకొండ
- జిల్లాలో చివరి స్థానంలో మాచర్ల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసే దిశగా జోరుగా సభ్యత్వాల నమోదు జరుగుతుంది. సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమై ఇప్పటికే నెల రోజులు దాటింది. జిల్లాలో సభ్యత్వ నమోదులో నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే వినుకొండ ప్రథమ స్థానంలో ఉండగా మాచర్ల చివరి స్థానంలో ఉంది. రూ.లక్ష చెల్లించి పెదకూరపాడు నియోజకవర్గంలో 36 మంది, వినుకొండలో 23, సత్తెనపల్లిలో 9, నరసరావుపేటలో 12, గురజాలలో ఆరు, చిలకలూరిపేటలో ఆరు, మాచర్ల నియోజకవర్గంలో నలుగురు శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. 3,43,136 సభ్యత్వాలు నమోదు కాగా వీటిలో కొత్తగా నమోదైన సభ్యత్వాలు 1,45,925 ఉన్నాయి. 1,97,211 రెన్యూవల్ సభ్యత్వాలు ఉన్నాయి. గతంలో సభ్యత్వ నమోదులో రాష్టంలోనే వినుకొండ ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు నేతృత్వంలో ఈసారి కూడా సభ్యత్వాల నమోదులో వినుకొండ ముందంజలో ఉంది. ఇప్పటి వరకు రాష్ట్రంలోనే వినుకొండ నియోజకవర్గం టాప్ టెన్‌లో ఉంది.

సభ్యత్వాల నమోదు ఇలా..

నియోజకవర్గం	సభ్యత్వాలు
వినుకొండ	87,878
గురజాల	69,603
పెదకూరపాడు	45,160
చిలకలూరిపేట	43,356
సత్తెనపల్లి	40,197
నరసరావుపేట	29,319
మాచర్ల	27,623

కలెక్టర్లకు దిశానిర్దేశం

- పలు అంశాలపై సమీక్ష.. ఫలితాలపై చర్చ
- వ్యవసాయ, అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి
- తొలిరోజు సదస్సులో కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచన
- ఆర్టీజీఎస్‌లో ప్రథమ స్థానం.. గుంటూరు కలెక్టర్‌కు అభినందనలు


సదస్సుకు హాజరైన పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తే ఫలితాలు బాగుంటాయి.. ఆయా రంగాల పురోగతిపై దృష్టి పెట్టాలి.. అని కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలెక్టర్ల రెండో సదస్సు బుధవారం రాజధాని అమరావతి సచివాలయంలో ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సుకు గుంటూరు, పల్నాడు, బాపట్ల కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు, వెంకటమురళిలు హాజరయ్యారు. ఈ క్రమంలో తొలి రోజు సదస్సులో మూడు జిల్లాలకు సంబంధించిన వివిధ అంశాలు, విభాగాల వారీగా ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ ఆరు నెలల వ్యవధిలో సాధించిన ఫలితాలపైన, జిల్లా గణాంకాలను సదస్సులో ప్రస్తావించి వాటిపై సమగ్రంగా చర్చించారు.

వ్యవసాయంలో వెనుకబాటు..

వ్యవసాయ, అనుబంధ రంగాల్లో గుంటూరు జిల్లా వెనుకబడిందని, రాష్ట్ర వ్యాప్తంగా చూసుకుంటే 22వ స్థానంలో ఉన్నదని ఈ రంగంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ శాఖల సెక్రటరీలు కలెక్టర్ నాగలక్ష్మికి సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి జీవీఏలో గుంటూరు కేవలం రూ.9566 కోట్లు మాత్రమే సాధించింది. పారిశ్రామిక రంగంలో రూ.13,655 కోట్ల జీవీఏతో ఏడో ర్యాంకు, సర్వీసు సెక్టార్‌లో రూ.31,591 కోట్లతో మూడో ర్యాంకు సాధించింది. జీడీడీపీ(గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్టు) ప్రస్తుత ధరలను బట్టి 2028-29 నాటికి రూ.1,31,705 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ఐటీ, పర్యాటకం, షాపింగ్, హోటళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్(రియల్ టైం గవర్నెన్స్ సిస్టమ్)లో గుంటూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు అభినందించారు. 85 శాతం భవన నిర్మాణాలు పూర్తి కాగా వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. హౌస్‌హోల్డ్ సర్వే డేటాలో 2,65,934 మంది మిస్సింగ్ అయ్యారని, వారిని గుర్తించాలని ఆదేశించారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ విషయంలో 14.6 శాతం మందికి ఇళ్ల వద్ద ఇవ్వడం లేదని సర్వేలో తేలింది. 5.7 శాతం మంది వద్ద సచివాలయాల సెక్రటరీలు అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. దీనిపై కలెక్టర్ ఎక్కువగా దృష్టి పెట్టి పింఛన్‌దారులు 100 శాతం సంతృప్తి వ్యక్తం చేసేలా చూడాలని ఆదేశించారు. అన్నక్యాంటిన్ల విషయంలో పారిశుధ్యం బాగోలేదని 8 శాతం, ఫర్వాలేదని 40 శాతం మంది చెప్పారు. టైంకి భోజనం పెడుతున్నారని 100 శాతం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ దృష్ట్యా అన్న క్యాంటిన్లలో పారిశుధ్యం, పరిశుభ్రత మెరుగుపరిచేలా చూడాలన్నారు.

మోటార్ సైకిల్ అదుపుతప్పి యువకుడు మృతి

మేడికొండూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న మోటార్ సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మైలు రాయిని ఢీకొని రోడ్డు పక్కన గుంటలో పడి నాదెండ్ల మండలం సంకురాత్రిపాడు గ్రామానికి చెందిన నందన విజయ్ కుమార్(30) బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం విజయ్‌కుమార్ మోటార్ సైకిల్‌పై నరసరావుపేట నుంచి గుంటూరు వస్తుండగా పేరేచర్ల సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మైలు రాయిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయ్ కుమార్ అక్కడికక్కడే మరణించాడు. కేసును పోలీసులు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్య

పెదకాకాని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డులో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం పెద్దకాకాని పోలీసులు తెలిపారు. ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల గ్రామానికి చెందిన దండ శ్రీనివాస్ రెడ్డి(24) బీటెక్ చదువుకొని ఖాళీగా ఉంటున్నాడు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో రింగ్‌రోడ్డులోని ఓ చెట్టుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఓ లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. గుంటూరు నగరాలకు చెందిన వింత అక్కిరెడ్డి(54) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 8న ఇంటి నుంచి బయటకు వచ్చి ఇన్నర్ రింగ్‌రోడ్డులో లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. రెండు రోజుల నుంచి బయటికి రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు అనుమానం వచ్చి పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి రూమ్ తాళాలు తెరిచి చూడగా అక్కిరెడ్డి మృతి చెంది ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

డాల్ మిల్లులో రూ.4.35 లక్షలు చోరీ

నాదెండ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామ పరిధిలో ఏఎంజీ ఎదురుగా ఉన్న డొంక రోడ్డులో గల డాల్ మిల్లులో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయ వాసవి డాల్ అండ్ రైస్ మిల్లులో మంగళవారం తెల్లవారు జామున తాళాలు పగల గొట్టి బీరువాలో ఉన్న రూ 4.35 లక్షల నగదును చోరీ చేశారు. మిల్లు భాగస్వామి కనకం లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రానికి రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఈ ఘనత సీఎం చంద్రబాబుదే
- జగన్ పోరుబాటను ప్రజలు పట్టించుకోరు
- ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి గత ఆర్నెలల్లో రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, రానున్న రోజుల్లో మరెన్నో పెట్టుబడులు రానున్నాయని, ఈ ఘనత సీఎం చంద్రబాబుదేనని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పోరుబాటను ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదనీ, జరిగిన పొరపాట్లు సరిదిద్దుకుంటే రానున్న రోజుల్లో కనీసం ప్రతిపక్ష హోదా అయినా లభిస్తుందని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకొని అప్పులపాలు చేశారనీ, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆర్నెలల్లోనే గత ప్రభుత్వ అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారధ్యంలో రూ. 4500 కోట్లతో 13 వేల గ్రామాల్లో 30 వేల అభివృద్ధి పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేయబోతున్నామని వివరించారు. ఒకేసారి రూ.4 వేలు పింఛన్ పెంచిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. రూ.15 వేల కోట్లతో రాజధాని అభివృద్ధి, రూ.12 వేల కోట్లతో పోలవరం అభివృద్ధికి నిధులు తెచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, రాష్ట్రంలో 198 అన్న క్యాంటీన్ల ద్వారా నిరుపేదల ఆకలి తీరుస్తున్నామని, 50 లక్షల మందికి దీపం పథకం ద్వారా సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. గతంలో నాసిరకం మద్యంతో వేలాదిమంది ప్రాణాలు గాలిలో కలిశాయని, నేడు చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మద్యం పాలసీ ద్వారా అతితక్కువ ధరకే నాణ్యమైన మద్యం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో 16 వేలకు పైగా నిరుద్యోగులకు డీఎస్సీ 6100 పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా నేడు అడుగులు వేస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి ఓర్చుకోలేక పోతున్నారని విమర్శించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ అమృతపూడి కోటయ్య, ప్రముఖ న్యాయవాది, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు పోట్లూరి సైదారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, పీవీ సురేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం..

కె.నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. అదేవిధంగా ఆర్.కృష్ణయ్య, సాన సతీష్, బీద మస్తాన్‌కు రాజ్యసభ సీట్లు కేటాయించి గౌరవించడం అభినందనీయమని తెలిపారు.

లండన్ టు అమరావతి పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావు, వర్సిటీ అధికారులు

పెదకాకాని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆంగ్ల విభాగంలో సీనియర్ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ గుజ్జు చెన్నారెడ్డి రచించిన లండన్ టు అమరావతి నవలను బుధవారం ఇంచార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చెన్నారెడ్డి తన రచనల ద్వారా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్నారని అభినందించారు. ఇటువంటి రచనలు సమాజ సోపానాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రచనల్లోని సాహిత్యం నేటి తరానికి ఎంతో దోహదపడుతుందని సూచించారు. పుస్తక పఠనంలో ఉన్న మక్కువ సాహిత్య రచనలో చూపినట్లయితే విలువైన సాహిత్య సంపద సృష్టించవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి సాహిత్య రచనలు ఆహ్వానించ తగినవని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంచార్జి రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి మాట్లాడుతూ బోధన, పరిశోధనలతోపాటు సాహిత్యం పట్ల చెన్నారెడ్డి చూపిస్తున్న మక్కువ ప్రశంసనీయమని కొనియాడారు. ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య వీరయ్య, ఆచార్య జాన్సన్, ఆచార్య ప్రమీలారాణి మాట్లాడుతూ చెన్నారెడ్డి సాహిత్య రచన ఎంతో ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. పుస్తక రచయిత ఆచార్య చెన్నారెడ్డి మాట్లాడుతూ తన లండన్ టు అమరావతి నవల నేపథ్యాన్ని వివరించారు. పుస్తక రచనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, రూస కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ఆచార్య జీవీఎస్ఆర్ ఆంజనేయులు, విదేశీ విద్యార్థుల విభాగం డైరెక్టర్ ఆచార్య పి .పద్మావతి, హెచ్‌ఆర్‌ఎం విభాగాధిపతి డాక్టర్ బి.నాగరాజు, జర్నలిజం ఇంచార్జి కోఆర్డినేటర్ డాక్టర్ జె.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధికి సీఎం నూతన పాలసీ


సూర్యలంక తీరంను పరిశీలిస్తున్న చైర్మన్ బాలాజి

బాపట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని టూరిజంను అభివృద్ధి చేసేందుకు నూతన పాలసీని ప్రవేశ పెట్టారని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బాలాజి తెలిపారు. బుధవారం బాపట్ల సూర్యలంక సముద్ర తీరాన్ని స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టూరిజం అంటే దేశంలోనే అగ్రగామి టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నూతన పాలసీని ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో టూరిజం ప్రదేశాలను పెంచటం ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుందన్నారు. టూరిజం అభివృద్ధి వలన రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. దీనిలో భాగంగానే సూర్యలంక తీరాన్ని పరిశీలించినట్లు తెలిపారు. సూర్యలంక తీరంలో అద్భుతమైన పరిస్థితులు ఉన్నాయనీ, చాలా పెద్దబీచ్ అని దీనిని మరి కొంత అభివృద్ధి చేసుకుంటే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో విశాఖబీచ్ తర్వాత బాపట్లబీచ్‌కి మంచి పేరు ఉందన్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులను తీసుకొని అభివృద్ధి చేసే విషయంలో గండికోట, అఖండగోదావరి సెంటర్‌లను తీసుకున్నప్పటికీ రెండో ఫేజ్‌లో బాపట్ల బీచ్‌ను కూడా తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రాజధానిలకు సూర్యలంకబీచ్ ఎంతో దగ్గరగా ఉందన్నారు. సూర్యలంక వద్ద ఉన్న స్టయిట్ రోడ్డు మీద కూడా షాపులను ఏర్పాటు చేయనున్నామనీ, తద్వారా షాపింగ్ చేసే పర్యాటకులకు నేరుగా బీచ్ కన్పిస్తుందన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం కైవశం


కాంస్య పతకం సాధించిన కోటేశ్వర్

తాడేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన సందు కోటేశ్వర్ రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. కాకినాడలో నవంబరు 6 నుంచి 9 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ 11 విభాగంలో కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. కాగా డిసెంబరు 5 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ కర్ణాటకలోని మైసూర్‌లో ఏపీ నుంచి అండర్ -11 విభాగంలో రింక్-2 (500+డి) పోటీల్లో ఉండవల్లికి చెందిన కోటేశ్వర్ కాంస్యపతకం సాధించి పలువురి మన్ననలు అందుకున్నారు.

వాగులో పడి యువకుడు మృతి


హరీష్ (ఫైల్)

కొత్తలూరు (శావల్యాపురం) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గేదెలు మేపుకునేందుకు వెళ్లిన యువకుడు కాలు జారి వాగులో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తలూరు గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దావులూరి ప్రసాదు కుమారుడు దావులూరి హరీష్(26) ప్రతిరోజూ గేదెలను మేపుకునేందుకు పొలానికి వెళ్తుంటాడు. అదే క్రమంలో బుధవారం ఉప్పరపాలెంకు వెళ్లే దారిలో అంగలేరు వాగు వైపున్న పొలాలకు గేదెలను తోలుకెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో నీరు తాగేందుకు వాగులోకి దిగుతుండగా, కాలుజారి వాగులో పడిపోయాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో బయటకు రాలేక నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న రైతులు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలియజేయగా రైటర్ సలీం బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

నీ భర్తను చంపకుంటే.. నిన్ను చంపేస్తా

- సైనెడ్ ఉపయోగించాలని భార్యపై ఒత్తిడి
- ఎలా చేయాలో చూపేందుకు బిక్షగాడి హత్య
- పలు దఫాలుగా ఆమె భర్తపై హత్యాయత్నాలు
- ఇవీ ఓ వైసీపీ నాయకుడి ఉన్మాద చర్యలు


నాటి మంత్రి తానేటి వనితతో నాగేశ్వరరావు(ఫైల్)

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాను బెదిరించి లొంగదీసుకున్న మహిళతో ఆమె భర్తను హత్య చేయించేందుకు ఓ వైసీపీ నేత అమాయకుడైన ఓ బిక్షగాడిని హత్య చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన ఆ పార్టీ నేత దేవరకొండ నాగేశ్వరరావు అలియాస్ ఓంకార్ సాగించిన అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇతని అరాచకాలపై బాధిత కుటుంబం ఈ నెల 2న గుంటూరు జిల్లా ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితుల ఫిర్యాదుతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు, మహిళా పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు. ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన తర్వాత కేసులైతే నమోదు చేశారు గానీ ఇంతవరకు నిందితుడిని అదుపులోకి తీసుకోలేదు. ఇప్పటికీ కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బాధిత కుటుంబం నిర్వహించే దుకాణం వద్ద, ఇంటి సమీపంలో రెక్కీ నిర్వహిస్తుండటంతో ఆ కుటుంబం హడలిపోతోంది. బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకలూరిపేట రోడ్డులో మరమరాలబట్టీ దుకాణం నిర్వాహకురాలిని లొంగదీసుకునేందుకుగానూ నిందితుడు నాగేశ్వరరావు తన అనుచరులతో మూడు దఫాలు దొంగతనాలు చేయించాడు. బాధిత మహిళ నగరంపాలెం స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదు చేశారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

హత్య చేయించడానికి ఎన్నో ప్రయత్నాలు..

ఓ మహిళను లొంగదీసుకుని వారు ఏకాంతంగా ఉన్న సమయంలో తీసిన ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకొని ఆమెను బ్లాక్ మెయిల్ చేసి ఆమె ద్వారానే ఆమె భర్తను హత్య చేయించేందుకు ఆ వైసీపీ నేత కుట్ర పన్నాడు. ఇందుకు గానూ ఓ బిక్షగాడిని కడతేర్చాడు. భర్తను చంపక పోతే ఆమెను, ఆమె పిల్లల్ని చంపేస్తానంటూ బెదిరించాడు. ఎవరికి అనుమానం రాకుండా, చేతికి మట్టి అంటకుండా ఎలా చంపాలి అనేది ఆమెకు తెలియజెప్పడానికి ఏకంగా ఓ బిక్షగాడిని సైనెడ్ ఇచ్చి చంపేసినట్లు బాధిత మహిళ ఆరోపిస్తుంది. చిలకలూరిపేట వెళ్లే జాతీయ రహదారిపై కాటూరి మెడికల్ కళాశాల సమీపంలోని సర్వీసు రోడ్డులో ఓ బిక్షగాడు గోనె పట్టాలతో డేరా కట్టుకొని నివాసం ఉండేవాడు. దారిన వచ్చి పోయేవారు ఇచ్చే వాటితో కడుపు నింపుకునేవాడు. అయితే వైసీపీ నేత నాగేశ్వరరావు ఓ బంగారు షాపులో పనిచేసే వ్యక్తి వద్ద నుంచి సైనెడ్ తెప్పించి బిక్షగాడికి నీటిలో కలిపి తాగించాడు. దీంతో అతను చనిపోయాడు. ఈ మొత్తం వ్యవహారాన్ని తన సెల్ ఫోన్‌లో వీడియో తీసి ఆమెకు చూపించాడు. ఇదేవిధంగా ఆమె భర్తను చంపాలని ఆమెను బెదిరించాడు. దీంతో భయపడిన మహిళ తన భర్తకు ఆహారంలో సైనెడ్ కలిపింది. అయితే ఆ ఆహారం నోట్లో పెట్టుకోగానే వికారంగా ఉండడంతో భర్త దాన్ని ఊసేశాడు. దీంతో ఏ మాత్రం అనుమానం రాకుండా ఆమె వెంటనే ఆహార పదార్థాలను బయట పడేసింది. ఈ ప్రయత్నం విఫలం కావడంతో ఆ తర్వాత విజయవాడలో కుక్కలు పట్టుకునే వారి వద్ద నుంచి తీసుకొచ్చిన ఇంజక్షన్ ఆమెకు ఇచ్చి భర్త నిద్రపోయే సమయంలో చేయాలంటూ బెదిరించాడు. కాని ఆమె ఇంజక్షన్ చేయలేకపోయింది. భర్తతో ద్విచక్ర వాహనంపై వచ్చే సమయంలో నీ చేతిలో ఉన్న సంచి కింద పడేసుకుంటే దానికోసం బండి ఆపుతాడని, ఆ సమయంలో తాము వచ్చి అతనికి ఇంజక్షన్ గుచ్చి వెళ్తామని చెప్పాడు. ఆ విధంగా చేయాలని నాగేశ్వరరావు ఒత్తిడి తెచ్చినా బాధిత మహిళ అంగీకరించలేదు. దీంతో హత్య చేయడానికి నాగేశ్వరరావు తన అనుచరులతో స్వయంగా రంగంలోకి దిగాడు.

చంద్రబాబుపై కోడిగుడ్లతో దాడి

2011లో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు వెంగళాయపాలెం వచ్చిన సందర్భంలో తన అనుచరులతో చంద్రబాబుపై కోడిగుడ్లతో దాడి చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులోనూ పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కబ్జాలు.. అరాచకాలు

దేవరకొండ నాగేశ్వరరావు వెంగళాయపాలెంలో వైసీపీ నాయకుడుగా చలామణి అవుతూ గ్రామంలో కబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడిన సందర్భాలు అనేకం ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో రోడ్డు పక్కన వాగు పోరంబోకులో అనుమతి లేకుండా ఇంటిని నిర్మించాడు. అందులో కొంతకాలం వైసీపీ కార్యాలయం నిర్వహించాడు. ఎన్ని నేరాలు చేసినప్పటికీ పోలీసులు మాత్రం కేసులు నమోదు చేయడంలేదు. ఆయన్ను పట్టుకునేందుకు కనీస ప్రయత్నం కూడా చేయడంలేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కృత్రిమ మేధ ద్వారా విస్తృత పరిశోధనలు

పెదకాకాని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో 'మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ప్రారంభ సభకు ఇంచార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మారుతున్న ఆహార అలవాట్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. వాటిని ప్రజలకు తెలియపరచడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషించాలని గుర్తు చేశారు. ముఖ్యవక్తగా పాల్గొన్న మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఉన్న మంగళయాటన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ జన్యు క్రమ లోపాల వల్ల కలిగే రుగ్మతలను ఆధునిక పద్ధతుల ద్వారా చికిత్స చేయవచ్చునని పేర్కొన్నారు. భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఐ. బాలకృష్ణ మాట్లాడుతూ సాంకేతికత వల్ల కలుగుతున్న దుష్ప్రయోజనాలను వివరించారు. బెంగళూరులోని అల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎండీ సలాహుద్దీన్ డీప్ లెర్నింగ్ మిషన్, లెర్నింగ్ ఆల్గారిజమ్ ఉపయోగించి ఔషధ లక్ష్యాలను గుర్తించడం, దానికి అనుగుణంగా ఔషధాలను కనుగొనడంలో ఏఐ ముఖ్యమైన భాగంగా మారిందని పేర్కొన్నారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కేసీరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ కో స్పాన్సర్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.ప్రమీలారాణి అధ్యక్షత వహించారు. సదస్సులో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, కో కన్వీనర్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.సుజన, కోశాధికారి డాక్టర్ కేతు ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.మస్తానమ్మ, కె.విజయ్ కిషోర్, తెనాలిలోని ఏఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94,102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

ఉత్తరాఖండ్‌పై రాజస్థాన్ భారీ స్కోరు

మంగళగిరి సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఉత్తరాఖండ్, రాజస్థాన్ మధ్య మూడు రోజుల మ్యాచ్ బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలుత రాజస్థాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 82.1 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి రాజస్థాన్ 266 పరుగులు చేసింది. యథార్థ్ భరద్వాజ్ 8 ఫోర్లతో 50 పరుగులు, షిఫాన్ ఖాన్ 5 ఫోర్లతో 48 పరుగులు చేశారు. ఉత్తరాఖండ్ బౌలర్లు అభిమన్యు, ఎండీ షాద్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది.

తూనికల శాఖ అధికారుల దాడులు

దుర్గి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దుర్గిలో బుధవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు జరిపారు. వినుకొండ రోడ్డులో గల ఓ దుకాణంలో తూనికలలో వ్య త్యాసం ఉన్నట్లు గుర్తించారు. కాగా అధికారులు దాడులు నిర్వహిస్తున్నట్లు సమాచారంతో వ్యాపారులు పలువురు తమ దుకాణాల ను మూసివేశారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లారు. ఈ తనిఖీలో ఉమ్మడి గుంటూరు జిల్లా తూనికల కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ జాన్‌సైదా, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

వెల్దుర్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తహసీల్దార్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడు తూ మండలంలో నాలుగు మైనర్ ఇరిగేషన్ చెరువులు వున్నట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీన ఈ చెరువులకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయన్నారు.

సాగునీటి సంఘాల ఓటర్లు 12325

రెంటచింతల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న నిర్వహించే సాగు నీటి సంఘాలకు సంబంధించి ఓటర్ల జాబితాను బుధవారం రెవెన్యూ అధికారులు వెల్లడించారు. తుమృకోటలో పురుషులు 1520, మహిళలు 566, పశర్లపాడు 1338, 493. కొత్త, పాత పాలువాయిలో 1574, 805. రెంటాల 1920, 906, రెంటచింతల 955, 456. మిట్టగుడిపాడు 1276, 516. మొత్తం ఓటర్లసంఖ్య 12325. మండలంలో 6 సాగు నీటి సంఘాలు 2 డీసీలున్నాయి.

భగవద్గీత ఆచరణతో జీవితం సాఫల్యం

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గీతాజయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని వైకుంఠపురంలోని భవఘ్ని ఆరామం. శ్రీవేద వ్యాస సనాతన ధర్మక్షేత్రంలో భవఘ్ని గురువుల పర్యవేక్షణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వ్యాస మహర్షి ధర్మక్షేత్రంలో ప్రత్యేక ఆరాధనలు, అభిషేకాలు నిర్వహించారు. భగవద్గీత ఆరాధనను షేక్ సాయిబాబు, షేక్ బేబీ దంపతులు చేశా రు. వేలాది మంది భవఘ్ని శిష్యులు కార్యక్ర మంలో పాల్గొని వ్యాసమహర్షి, గీతామాత, గురుదేవుని ఆశిస్సులు పొందారు. భవఘ్ని గురువు మాట్లాడుతూ సమస్త మానవాళి సన్మార్గంలో నడుచుకునేందుకు భగవద్గీత ఆచరణ తప్పనిసరిగా చేయాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

సత్తెనపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న ఐనవోలు శ్రీనివాసరావును బుధవారం ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్, సభ్యులు పరామర్శించి రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

ప్రతిభగల విద్యార్థినికి..

కారంపూడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యలో ప్రతిభ చూపుతున్న స్థానిక బ్రహ్మనాయుడు జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థిని కోనేటి కావ్యశ్రీకి బుధవారం హైస్కూల్లో పలు ట్రస్టుల ప్రతినిధులు ఆర్థిక సాయం అందజేశారు. స్వేచ్ఛరత్నాల ట్రస్టు ద్వారా రవి శంకర్ రూ.5 వేలు, ఉల్లాస్ ట్రస్టు ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలి

● గురజాల డీఎస్పీ జగదీష్

కారంపూడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులు, లాకప్ గదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు గస్తీ పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ వాసు, తదితరులు పాల్గొన్నారు.

4 కేజీల గంజాయి స్వాధీనం !?

వెల్దుర్తి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరికి గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది.. దీనివెనుక ఎవరు ఉన్నారు.. అనే దానిపై విచారిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై వివరాలు తెలిపేందుకు పోలీసులు అందుబాటులోకి రాలేదు.

ముత్తూట్‌లో మరో గోల్‌మాల్

● కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన

సత్తెనపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగారాన్ని తాకట్టుపెట్టి నగదు తీసుకుంటే ముత్తూట్ ఫైనాన్స్ సిబ్బంది వడ్డీలపై వడ్డీలు వేసి ఇబ్బందులు పెడుతున్నారని పలువురు బాధితులు బుధవారం ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ కింది స్థాయి సిబ్బంది, మేనేజర్ ఆదినారాయణ, అప్రైజర్ అందరూ కలసి భారీస్థాయిలో నగ దును బదిలీ చేశారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశా రు. గట్టిగా ప్రశ్నిస్తే మీ పేరుపై గోల్డ్ రిజిస్టర్ కాలేదని, వడ్డీ ఎక్కువగా కట్టాలని పొంతన లేని సమాధానాలు చెపుతున్నారని ఫైనాన్స్‌లో బంగారం తాకట్టు పెట్టిన రాంబాబు, నర్రా నర్సయ్య, కే వెంకటలక్ష్మి, వీ అరుణలు ఆవేదన వ్యక్తం చేశారు. తాను బంగారం తాకట్టు పెట్టి రూ.50వేలు తీసుకున్నానని రాంబాబు అనే వ్యక్తి చెప్పాడు. రూ.18వేలు జమ చేయగా ఇంకా రూ.50వేలు అప్పుగా చూపుతున్నారని, కట్టిన రూ.18వేలు ఏమయ్యాయని? ప్రశ్నిస్తే ముత్తూట్ యాజమాన్యం సరైన సమాధానం చెప్పకుండా దాటేస్తున్నారన్నారు. నర్రా నరసయ్య, జే వెంకటలక్ష్మి, వీ అరుణలు తమ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.50 వేలు నగదు తీసుకున్నామని, తిరిగి రూ.30వేలు చెల్లించామని, ఐనా ఇంకా రూ.50వేలు చెల్లించాలంటూ బ్రాంచ్ మేనేజర్ ఆదినారాయణ తమను నిలదీస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టిసారించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

దాచేపల్లి పాతబస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక అవస్థలు

● నిత్యం వేలాది మంది ప్రయాణికుల రాకపోకలు
● అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించని తీరు
● నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

దాచేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అభివృద్ధి చెందింది. ఈ ప్రాంతంలో పలురకాల సిమెంట్ ఫ్యాక్టరీల రాకతో అన్నివర్గాల ప్రజల జీవనోపాధి మెరుగుపడింది. తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దు మండలంగా దాచేపల్లి ఉంది. అంతేకాకుండా హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం, ముంబాయి, కలకత్తా, శబరిమలై వంటి దూరప్రాంతాలకు వెళ్లేందుకు రైలు మార్గం అభివృద్ధి చెందింది. అదేవిధంగా విద్యావ్యవస్థ కూడా మెరుగుపడింది. అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్న దాచేపల్లి పట్టణంలో ప్రజలకు కావలసిన మౌళిక వసతుల కల్పనలో నగర పంచాయతీ వెనుకబడిందని ప్రధానంగా మహిళల నుంచి విమర్శలు వస్తున్నాయి. దాచేపల్లి నగర పంచాయతీలోని పాతబస్టాండ్‌లో నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. మలమూత్ర విసర్జనకు కావలసిన వసతి లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మహిళలు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై గతంలో ప్రజాసంఘాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు నగర పంచాయతీ సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయినప్పటికీ నగర పంచాయతీ అధికారులు సమస్యపై స్పందించ లేదు. దీంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. నిత్యం జనంతో రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో మహిళల గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మహిళా సంఘాల నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళతామని మహిళలు తెలిపారు.



దాచేపల్లి పాత బస్టాండ్‌లో బస్సు కోసం వేచివున్న ప్రయాణికులు

పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రవిబాబు

క్రోసూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేదలు సాగు చేసుకుంటున్న పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జీ రవిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గరికపాడులో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో స్థానిక రైతులతో కలిసి ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు. సర్వే నెంబరు 132లో సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. జిల్లాలో పెద్ద ఎత్తున పోరంబోకు భూములను పేదలు సాగు చేసుకుంటున్నారని, సమస్యను అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరావుకు వారు వినతిపత్రం సమర్పించారు. సదస్సులో వీఆర్వో మస్తాన్‌వలి, సర్వేయర్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చల్ల గరిగలో 37 అర్జీలు.. 17 పరిష్కారం



చల్లగరిగ గ్రామ రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కే శ్రీనివాస్

అచ్చంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లగరిగ గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ సదస్సులో 37 అర్జీలు రాగా వాటిలో 17 అర్జీలు పరిష్కరించినట్టు తహసీల్దార్ కే శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన 45 రోజుల్లో మిగిలిన అర్జీలు పరిష్కరిస్తామన్నారు. ఈయనతో పాటు రెవెన్యూ సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకుడు పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **బెల్లంకొండ (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గంగిరెడ్డిపాలెంలో రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మున్నీసా బేగం మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని, ఈ సభలో రైతులు తమ సమస్యలను అధికారుల ముందు అర్జీల రూపంలో ఇస్తే వెంటనే సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగిరెడ్డిపాలెం సర్పంచ్ జగన్, ఎంపీటీసీ బద్దూరి పిచ్చిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మాదినపాడులో రెవెన్యూ సదస్సు

దాచేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం మాదినపాడు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మాదినపాడు, శివారు గ్రామాలైన కొత్తూరు, సారంగపల్లి అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు సదస్సులో పాల్గొన్నారు. రైతుల నుంచి 14 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ కుటుంబరావు తెలిపారు. కార్యక్రమంలో డీటీ రాజు, ఆర్‌ఐ శరత్, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులేశునిపల్లెలో..

దుర్గి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులేశునిపల్లెలో బుధవారం తహసీల్దార్ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై ప్రజల నుంచి 8 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత వున్నం మహేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతిని సందర్శించిన కూచిపూడి నాట్యకళాకారిణి



సరళకుమారిని సన్మానిస్తున్న జాష్టి వీరాంజనేయులు

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా శైవ క్షేత్రంగా పేరు గాంచిన అమరావతిని హంస అవార్డు గ్రహీత కూచిపూడి నృత్య కళాకారిణి, సినీ ఆర్టిస్టు గంటా సరళకుమారి సందర్శించారు. ధ్యాన బుద్ధ ప్రాజెక్టు, పురావస్తు ప్రదర్శన శాలను సందర్శించి అమరావతి రావడం అదృష్టంగా భావిస్తున్నానని ఆమె తెలిపారు. రాజధాని అమరావతితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఈ అమరావతి కూడా అభివృద్ధి సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సరళకుమారిని అంతర్జాతీయ పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాష్టి వీరాంజనేయులు మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నీటిమట్టం బుధవారం నాటికి 582.09 అడుగులు ఉంది. ఇది 291.37 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 8,023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,679 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,069 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 43,571 క్యూసెక్కులు విడుదలవుతుంది. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 43,571 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 41.80 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి మూడు వందల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

తాళాలు పగులగొట్టి బంగారం చోరీ

దాచేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకొని ఇంటి తాళాలు పగులగొట్టి బీరు వాలో దాచిన బంగారం, వెండి పట్టీలు దొంగతనం చేసిన సంఘటన బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికూడి గ్రామ సమీపంలో జగనన్న కాలనీ వద్ద జరిగింది. కాలనీలో నివాసముంటున్న లాం విద్యాసాగర్ రెంటచింతల ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఉదయం విద్యాసాగర్ ఉద్యోగ బాధ్యత నిమిత్తం రెంటచింతల వెళ్లగా పిల్లలు పాఠశాలకు వెళ్లారు. భార్య కూడా తాళం వేసి ఉద్యోగ నిమిత్తం వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి బీరువాలో వుంచిన 8 గ్రాముల బంగారం, వెండి పట్టీలు దొంగిలించారు. సాయంత్రం ఇంటికొచ్చే సమయానికి ఇంటి తాళాలు పగులగొట్టి, సామాన్లు చిందరవందరగా పడి ఉండటాన్ని చూసి అనుమానంతో బీరువాను పరిశీలించగా అందులో ఉన్న బంగారం, వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. దాచేపల్లి ఎస్‌ఐ పాపారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించారు.

ఆలయ హుండీలోని నగదు అపహరణ

నకరికల్లు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుంకలగుంటలో ఉన్న కార్యసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు గేట్ల తాళాలను పగుల గొట్టి హుండీలోని నగదును అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుంకలగుంట ప్రధాన రహదారి పక్కనే ఉన్న కార్యసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గేటు తాళాలు పగల గొట్టి రెండు హుండీలను ఆలయం వెనుక వైపు పడవేశారు. హుండీలో నాణేలను వదిలేసి కరెన్సీ రూపంలో ఉన్న నగదును దుండగులు అపహరించుకు పోయారు. నకరికల్లు ఏఎస్‌ఐ పీ వెంకటేశ్వర్లు, క్లూస్ టీమ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను, ఆధారాలను సేకరించారు. నకరికల్లు ఎస్‌ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్, మొబైల్ చోరీ

ఇదిలా ఉండగా తెలంగాణా రాష్ట్రం నుంచి వరి నూర్పిళ్ళ కోసం వచ్చి కుంకలగుంటలో ఉంటున్న వ్యక్తులకు సంబంధించి ఒక బైక్‌ను, మొబైల్‌ను అపహరించుకు పోయారు. ఆలయంలో దొంగతనానికి పాల్పడిన దుండగులే బైక్‌ను, మొబైల్‌ను అపరించుకుపోయినట్టు అనుమానిస్తున్నారు.



కార్యసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

దొంగలను పట్టుకుంటాం

హుండీలోని నగదును అపహరించుకుపోయిన దొంగలను పట్టుకొనేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్న ట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ, షటిల్ పోటీలు

పెదకూరపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని జీఆర్‌సీ ఆర్‌కే శ్రీచైతన్య హైస్కూల్ ప్రాంగణంలో జీఆర్‌సీఆర్‌కే స్పోర్ట్స్ అకాడ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యా డ్మింటన్ పోటీలు బుధవారం హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. గుత్తా రత్న చంద్ర రామ కోటేశ్వరి మెమోరియల్ ద్వారా జరిగే ఈ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయని నిర్వాహకులు గుత్తా కవిత రాము తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను అభివృద్ధి చేసేందుకు ప్రతి ఏడాది క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెరగడంతో పాటు దేహ దారుఢ్యం మెరుగుపడుతుందని తెలిపారు.



పెదకూరపాడులో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

బాడ్మింటన్ పోటీల్లో విజేతలు

రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీల్లో విజేతల వివరాలను నిర్వాహకులు గుత్తా కవిత రాము బుధవారం రాత్రి తెలిపారు. ఈ పోటీల్లో 14 జట్లు పాల్గొనగా బాడ్మింటన్, మెడలిస్టు పోటీల్లో విజయవాడకు చెందిన వంశీ, రాహుల్, మునీర్, హేమంత్‌ల మధ్య జరిగిన పోటీల్లో వంశీ, రాహుల్ జోడీ విజేతగా నిలిచారు. రెండో సెమీ ఫైనల్‌లో నరసరావుపేటకు చెందిన ధనుష్, ధీరజ్ జోడి, విజయవాడకు చెందిన జితేంద్ర, నవీన్‌లు పోటీ పడగా ధీరజ్, ధనుష్ జోడీలు విజేతలుగా నిలిచి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. నాన్ మెడలిస్టు పోటీల్లో నరసరావుపేటకు చెందిన బాషా, చక్రిల జోడి మొదటి స్థానంలో నిలిచింది. విజయవాడకు చెందిన జితేంద్ర, నవీన్ జోడి రెండో స్థానంలో నిలిచింది. విజయవాడకు చెందిన ప్రణయ్, మల్లిలు మూడో స్థానం సాధించారు. జీఆర్‌సీ ఆర్‌కే శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన అరుణ్, దానమ్‌ల జోడి నాలుగో స్థానంలో నిలిచింది.

రామలింగేశ్వర స్వామి ఆలయ అక్రమాలపై విచారణ

బెల్లంకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెంలో గతంలో రామలింగేశ్వర స్వామి ఆలయ అక్రమాలపై విచారణ నిర్వహించాలని మన్నె సుల్తాన్‌పాలెం గ్రామానికి చెందిన కొంతమంది దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా బుధవారం గుంటూరు డిప్యూటీ కమిషనర్ కేవీ శ్రీనివాస్, పల్నాడు జిల్లా దేవదాయశాఖ ఏసీ వీరాంజనేయులు, సూపరింటెండెంట్ లీలావతి, బెల్లంకొండ ఈవో వెంకటేశ్వరరెడ్డి, మరికొంతమంది అధికారులు విచారణ చేపట్టారు. బెల్లంకొండ ఈవోగా గతంలో పనిచేసిన రామకోటిరెడ్డి, పల్నాడు ఏసీ సత్యనారాయణరెడ్డి, మరి కొందరిపై విచారణ చేపట్టారు. దేవదాయశాఖ గొల్లపూడి ఆదేశానుసారం గుంటూరు డిప్యూటీ కమిషనర్, దేవదాయశాఖ విజిలెన్స్ విచారణ గ్రామప్రజల సమక్షంలో చేపట్టారు. గతంలో పనిచేసిన ఈవో రామకోటిరెడ్డి, గ్రామస్తులు కొంత మంది దేవదాయశాఖ వారి అనుమతులు లేకుండా రామలింగేశ్వర స్వామి వారి మూలవిరాట్‌ను, దేవాలయంలోని శివలింగాన్ని అర్ధరాత్రి జేసీబీలతో గర్భాలయాలయాన్ని తొలగించారు. గర్భాలయంలోని మూలవిరాట్ కింద ఎంతో విలువైన వస్తువులైన బంగారు నాణాలు, వజ్రాలు, శంకు చక్రాలు, రాగి రేకులు లభించాయని, ఆ విలువైన వస్తువులను గతంలో పనిచేసిన ఈవో, గుమస్తా, గ్రామస్థులు కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా పంచుకున్నారని దానిపై గ్రామంలో విజిలెన్స్ విచారణ నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ లక్ష్యం

● ఎంపీడీవో జీ శ్రీనివాసరావు

క్రోసూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ లక్ష్యమని ఎంపీడీవో జీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రెండో రోజు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన, మెరుగైన జీవనోపాధి ఉన్న గ్రామంగా, నీటి సమృద్ధి పచ్చని పంటలతో కళకళలాడే విధంగా మౌళిక సదుపాయాలు, సామాజిక న్యాయం, సుపరి పాలన మొదలైనవి గ్రామ స్వరాజ్ అభియాన్ ద్వారా సాధ్యమవుతాయన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల సిబ్బందికి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు, ఆరోగ్య కార్యకర్తలకు, ఐసీడీఎస్ ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, ఆరోగ్య విస్తరణ అధికారి శ్యాంసన్, వెలుగు ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నకరికల్లు (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కూడా శిక్షణ కొనసాగింది. గ్రామాల్లోని వనరులను వినియోగించుకొని పంచాయతీలు బలోపేతం అవ్వాలని, ఇందుకు అనుసరించాల్సిన కార్యాచరణ గురించి శిక్షణలో తెలిపారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పెదకూరపాడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ స్థాయి ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థాయి ప్రభుత్వోద్యోగులు శిక్షణను ఉపయోగించుకోవాలని ఎంపీడీవో అన్నారు.

పంట కోత ప్రయోగాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి : ఏడీఏ

క్రోసూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల సిబ్బంది పంట కోత ప్రయోగాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని క్రోసూరు ఏడీఏ బీ హనుమంతరావు అన్నారు. బుధవారం 88 తాళ్ళూరు, గుడిపాడు, అనంతవరం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడెల్పు విస్తీర్ణంలో ఉన్న వరి దుబ్బులను కోసి వాటిని నూర్పగా 13.5 కిలోల పచ్చి ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. ఇది ఎకరాకు 25 బస్తాలతో సమానమని తెలియజేశారు. పంట కోత ప్రయోగాలు నిర్వహించే సమయంలో ఏ మాత్రం అలసత్వం వహించినా దేశ ఉత్పత్తిలో దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని, దిగుబడి లెక్కించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవో వేణుగోపాల్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు ఫీజులుండవు

● తహసీల్దార్ మధుబాబు

ఫటా ఫట్



పిడుగురాళ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలపై ఇచ్చే దరఖాస్తులకు ఎటువంటి ఫీజు లేకుండానే సేవలందుతాయని తహసీల్దార్ జే మధుబాబు తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో బుధవారం ఫటా ఫట్.

ప్ర: దరఖాస్తులు ఎలా ఇవ్వాలి ?

జ: ఈ నెల 6వ తేదీ నుంచి జరుగుతున్న రెవెన్యూ సద స్సులు జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో జరిగే భూసమ స్యలపై సదస్సుల్లో దరఖాస్తులు అందివ్వవచ్చు. తెల్లకాగి తంపైన కానీ, సదస్సులో కౌంటర్‌ల వద్ద ఇచ్చే పత్రాలను నింపి రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు అందజేయాలి.

ప్ర: దరఖాస్తులు ఎలా పరిష్కరిస్తారు ?

జ: రెవెన్యూ సదస్సుల్లో రైతులు అందించిన దరఖాసుల్లో వెంటనే పరిష్కరించదగినవి ఉన్నట్లైతే అప్పటికప్పుడే పరిష్కారమవుతాయి. ధ్రువపత్రాలు అన్నీ ఉన్నట్లైతే ఆన్‌లైన్‌లో భూయజమాని వివరాలు నమోదు చేస్తారు.

ప్ర: ఏఏ సమస్యలపై దరఖాస్తులు అందించవచ్చు ?

జ: భూసంబంధిత సరిహద్దులు, భూమి కొలత నిర్ధారణ, 22-ఏలో ఉన్న భూములకు, వక్ఫ్‌బోర్డు, దేవదాయశాఖకు సంబంధించిన అన్ని దరఖాస్తులు రెవెన్యూ సదస్సులో అందించవచ్చు.

ప్ర: ఎప్పటిలోగా పరిష్కరిస్తారు ?

జ: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో అప్పటికప్పుడు పరిష్కరించదగినవి ఉంటే పరిష్కరిస్తాం. మిగిలినవి ప్రాధాన్యక్రమాన్ని బట్టి పరిష్కరిస్తాం.

సాగునీటి సంఘాల ఎన్నికలపై యరపతినేని సమీక్ష



పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుదేశం కార్యాలయం నందు గురజాల నియోజకవర్గంలోని అన్ని మండలాల రైతులు, రైతు సంఘం నాయకులు, మాజీ డీసీ చైర్మన్లతో, మండల పార్టీ కన్వీనర్లతో, కూటమి నాయకులతో సాగునీటి సంఘాల ఎన్నికల గురించి బుధవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమీక్ష నిర్వహించారు. సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని అన్ని సాగునీటి సంఘాలకు టీడీపీ బలోపేతానికి.. గత ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేసిన అభ్యర్థులను ఉమ్మడిగా నేతల సమక్షంలో ఎన్నుకుంటారని చెప్పారు. ఈ సమావేశంలో పాండురంగ శ్రీనివాసరావు, వడ్డపల్లి సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంజల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ బద్రి, జమ్మగుంపుల లక్ష్మీనారాయణ, ఉన్నం సురేష్, శ్రీను, కూరపాటి కొండలు, రామారావు, శివ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మవారి ఆలయం వద్ద మొక్కు చెల్లించుకున్న కన్నా




సత్తెమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

అచ్చంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదిపాడు అటవీ ప్రాంతంలో ఉన్న సత్తెమ్మ అమ్మవారిని మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కన్నా లక్ష్మీనారాయణను భాష్యం ప్రవీణ్ ఘనంగా సన్మానించారు. సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

చేపల దాణాతో చెరువు నీరు కలుషితం

సమస్య ఇది.. స్పందించరూ

క్రోసూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): క్రోసూరు సామాజిక చెరువులో చేపల పెంపకం కోసం కొంత మంది కృత్రిమంగా తయారు చేసిన దాణా వేస్తున్నారని దీనివల్ల చెరువు నీరు కలుషితమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీరు కలుషితం కావటం వల్ల వాటిని తాగిన పశువులు, ఇతర జంతువులు రోగాల పాలవుతున్నాయని వారు తెలిపారు. అంతేగాక గతంలో గృహ నిర్మాణాలు చేసుకోవాలన్నా, పైకప్పు నిర్మించుకోవాలన్నా చెరువు నీరు వాడేవారమని, నీరు కలుషితం కావటం వల్ల గృహ నిర్మాణాలకు కూడా ఆ నీరు పనికి రావటం లేదని తెలియజేశారు. చెరువు నీటితో పంటలను సాగు చేసుకోవాలన్నా సందేహించాల్సి వస్తుందని చెపుతున్నారు. అధికారులు స్పందించి చెరువులో చేపల దాణాను వేయకుండా నిరోధించాలని వారు కోరారు.



క్రోసూరు చెరువులోని నీరు

జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన అధికారి

సత్తెనపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం పల్నాడు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి ఎం నీలావతీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆమె పరిశీలించారు. విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మను ఆదేశించారు. సంకల్ప్ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులపై అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. త్రైమాసిక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను విభజించి చదువుల్లో వెనుకబడిన ప్రతి ఐదుగురిని అధ్యాపకులు పర్యవేక్షించాలన్నారు. రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్టడీఅవర్స్ నిర్వహించాలన్నారు.



స్కామర్ల చేతికి చిక్కి విల విల?

- ఫోన్ హ్యాకింగ్‌లతో నగదు మాయం
- బంధాల బలహీనతలతో బెదిరింపులు
- పంజా విసురుతున్న సైబర్ నేరగాళ్లు



సైబర్ నేరగాళ్లు, స్కామర్ల బారినపడి ఆర్థికంగా నష్టపోవడం, మానసికంగా కుంగిపోవడం జరుగుతున్నాయి. ఆన్‌లైన్‌లో మోసపూరిత ప్రకటనలకు ఆకర్షితులై డబ్బు పోగొట్టుకున్న వాళ్లు, మోసపూరిత ఫోన్ కాల్స్ గురించి అవగాహన లేక తమ బ్యాంకు ఖాతాలు ఖాళీ చేయించుకున్న వాళ్ల సంఘటనలు తరచుగా వింటూనే ఉంటాం. సైబర్ నేరగాళ్ల బారి నపడే బాధితుల సంఖ్య రోజురోజు కూ పెరుగుతూనే ఉంది. ఈ తరహా మోసాలకు గురైన వారిలో ఉపాధ్యాయులు, వ్యాపారులు, సామాన్యులు.. ఇలా వివిధ రంగాలకు చెందిన వారు ఉన్నారు.

పొన్నూరుటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఆన్‌లైన్ మోసాలు, మరోవైపు ఫోన్ హ్యాకింగ్‌లు. వీటి బారినపడి ఆర్థికంగా, మానసికంగా దెబ్బ తింటున్న వారి సంఘటనల గురించి తరచుగా వింటూనే ఉన్నాం. సైబర్ నేరగాళ్లు, స్కామర్ల ఆఫర్లకు ఆకర్షితులై ఆర్థికంగా నష్టపోతున్నారు. మీ కుమారుడో, కుమార్తె కేసుల్లో చిక్కుకున్నారని వారు అరెస్టు కాకుండా తప్పించుకోవాలంటే డబ్బు చెల్లించాలంటూ ఏ మాత్రం అనుమానం రాకుండా మాట్లాడుతూ, కుటుంబ సంబంధాల బలహీనతలను అడ్డుపెట్టుకొని ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేయించుకుంటూ నేరాలకు పాల్పడుతున్నారు. ఆ ఫోన్‌కాల్స్ మోసపూరితమని తెలిసినా బాధితులు తలలు పట్టుకుంటున్నారు. ఈ తరహా ఘటనల్లో మోసపోయిన వ్యక్తుల్లో ఎక్కువ శాతం మంది ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావట్లేదు. నామోషీగా భావించో, పోలీస్ కేసు పెట్టినా తిరిగి తమ నగదు తమకు రాదేమోననే ఆలోచనతోనో వారు మిన్నకుండిపోతున్నారు.

సైబర్ క్రైమ్‌లు....

దేశంలో సాంకేతిక విప్లవం రావటంతో కంప్యూటర్ కే పరిమితమైన సాంకేతిక అరచేతిలో ఇమిడిపోయే సెల్‌ఫోన్‌లకు చేరింది. సాంకేతికతను వినియోగించుకోవడంతో మంచి జరుగుతుందనే భావించే ప్రజలు, సైబర్ నేరగాళ్ల, స్కామర్ల చేతికి చిక్కి విలవిలలాడే పరిస్థితులు. ప్రభుత్వాలు, పోలీసులు సైబర్ నేరాలపై ఎంత ప్రచారం చేసినా నేటికి సైబర్ నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. నేరగాళ్ల ఆఫర్ల ఉచ్చుకు చిక్కి సామాన్యులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

పంజా విసురుతున్న నేరగాళ్లు....

ప్రారంభంలో కంప్యూటర్లలోకి మాల్‌వేర్ చొప్పించి కంప్యూటర్‌లోని భద్రపరిచిన ఫైల్స్‌ను నిర్వీర్యం చేసిన సైబర్ నేరగాళ్లు క్రమంగా తమ ప్రాబల్యం పెంచుకుంటున్నారు. సెల్‌ఫోన్‌లోని వ్యక్తిగత విలువైన డేటాను హ్యాకింగ్ ద్వారా చోరీ చేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారు. నెట్ బ్యాంకింగ్ ద్వారా నగదు లావాదేవీలు వినియోగించేలా యాప్‌లు అందుబాటులోకి రావడంతో స్కామర్లు మరింతగా విజృంభిస్తున్నారు. నగదు బదిలీల సమయంలో అమాయికులను లక్ష్యంగా చేసుకుని వన్‌టైం పాస్‌వర్డ్‌లు దొంగిలించి నగదును ఖాతాదారులకు తెలియకుండా తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. సాంకేతికత మరింత అందుబాటులోకి రావడంతో సైబర్ నేరగాళ్లు మరో ముందడుగు వేసి, దేశం వెలుపల ఉండే సైబర్ నేరగాళ్ల వ్యక్తిగత వివరాలను అడ్డు పెట్టుకొని మోసాలు కొనసాగిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల కట్టడికి సరైన వ్యవస్థ లేకపోవడంతో వీరి నేరాలు కొనసాగుతున్నాయి. డార్క్ వైబ్ సైట్‌లో అందుబాటులో ఉండే సాంకేతికతను అడ్డంపెట్టుకుని యథేచ్ఛగా ఆన్‌లైన్ నేరాల దందా సాగిస్తున్నారు.

స్కామర్ల నేరాలు..

పొన్నూరు పట్టణానికి చెందిన భార్యాభర్తలు ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. భర్త నెలూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నట్లుగా ఆయనకు ఇటీవల సెల్‌ఫోన్ నుంచి కాల్ వచ్చింది. వీరి కుమారుడి వివరాలు వెల్లడించి 'మీ అబ్బాయి యాక్సిడెంట్ చేశాడు.. ఒక యువతి చావు బతుకుల మధ్య ఉంది. వెంటనే వైద్యం చేయించాలి. వెంటనే నగదు బదిలీ చేయాలి' అని చెప్పారు. తమ కుమారుడతో మాట్లాడించాలని సదరు వ్యక్తి కోరగా ఓ యువకుడు ఏడుపు స్వరం వినిపించారు. దీంతో, బెదిరిపోయిన సదరు వ్యక్తి ఫోన్‌లోనే రూ. 75 వేల నగదు బదిలీ చేశాడు. కేసు నుంచి తప్పించాలంటే మరో లక్ష చెల్లించాలని డిమాండ్ చేయడంతో ఆయనకు అనుమానం వచ్చింది. ఈ విషయమై విచారణ చేస్తే ఎటువంటి ప్రమాదం జరగలేదని, వారి కుమారుడు క్షేమంగా ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న ఆ తండ్రి మోసపోయినట్లు గుర్తించి లబోదిబోమంటున్నాడు.



బ్యాంక్ ఖాతా ఖాళీ..

పొన్నూరు మండలానికి చెందిన ఓ చిరు ఉద్యోగి వినియోగించే సెల్ ఫోన్‌కు ఒక ఆఫర్ మెసేజ్ వచ్చింది. దానికి ఆకర్షితుడైన ఆ ఉద్యోగి ఆ మెసేజ్‌ను డౌన్‌లోడు చేసుకున్నాడు. అంతే, అప్పటి నుంచి ఆ సెల్‌ఫోన్ హ్యాకింగ్‌కు గురైంది. సెల్ ఫోన్‌లో డేటా బదిలీ చేసుకోవడమే కాకుండా ఆ ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ. 79 వేలు ఉత్తరాది రాష్ట్రానికి చెందిన వ్యక్తుల ఖాతాలోకి బదిలీ చేసేసుకున్నారు. బ్యాంక్ ఖాతా ఖాళీ కావడంతో దిక్కుతోచని ఆ ఉద్యోగి పోలీసులను ఆశ్రయించాడు.

ఇంతవరకూ నెట్ ఆన్ చేయలేదు

ఓ వ్యక్తికి సోషల్ మీడియాలోని ఓ ఖాతా నుంచి ఇటీవల ఫోన్‌కాల్ వచ్చింది. ఆ ఫోన్ కాల్‌కు సమాధానం చెప్పడంతో, ఒక మహిళ దిగంబరంగా కనిపించి ఆ వ్యక్తిని కూడా వివస్త్రుడిగా మారమని కోరింది. దీంతో భయపడిన సదరు వ్యక్తి ఫోన్ కట్ చేసి నేటి వరకు నెట్ ఆన్ చేయలేదు. మరో ఘటనలో.. ఓ ప్రముఖ పత్రికా విలేకరికి ఇటీవల వాట్సప్ కాల్ వచ్చింది. కాలర్ ఐడీగా సీబీఐ అధికారిక చిహ్నం ఉండటంతోపాటు పోలీస్ ఆఫీసర్ యూనిఫారం ధరించిన వ్యక్తి ఫొటో ఉంది. దీంతో ఆ వ్యక్తి అవతలి వ్యక్తితో మాట్లాడాడు. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి సదరు వ్యక్తి కుమార్తె వివరాలు వెల్లడించడంతో పాటు ఆమెపై కేసు నమోదైందని, వదిలిపెట్టాలంటే ఫోన్ ద్వారా నగదు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో, ఆ వ్యక్తికి అనుమానం వచ్చి డిస్కనక్ట్ చేశాడు.

ఆకర్షణీయమైన రిటర్న్స్ ఇస్తాం

చేబ్రోలు మండలానికి చెందిన వ్యాపారవేత్తకు పెట్టుబడులు పెడితే ఆకర్షణీయమైన రిటర్న్స్ ఇస్తామని ఫోన్‌లో సందేశం వచ్చింది. ఇది నమ్మిన ఆ వ్యాపారవేత్త రూ. 35 లక్షలు వరకు ఫోన్‌లో బదిలీ చేశాడు. ఎంతకు రిటర్న్స్ రాకపోవడం, నగదు బదిలీ చేయించుకున్న వారు తమ ఫోన్లు ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి మోసపోయానని సదరు వ్యాపారవేత్త గ్రహించాడు. పోలీసులను ఆశ్రయించారు. అలాగే మరో మహిళలకు సైతం రూ. 40 లక్షల మేర స్కామర్లు మోసం చేసినట్లు సమాచారం.

సైబర్ నేరగాళ్లు స్కామర్లు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నప్పటికి వారికి అడ్డుకట్టు వేయలేక పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేరాలకు పాల్పడుతున్న వారు స్థానికులు కాకపోవటం, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు కావడం, దేశం వెలుపల నివసిస్తూ ఉండటంతో ఈ తరహా కేసులు పరిష్కారం జటిలంగా మారుతున్నాయని పోలీసులు చెబుతున్నారు.



మిర్చియార్డు చైర్మన్.. మళ్లీ ఓసీకే

- ప్రతిపాదన సిద్ధం చేసిన మార్కెటింగ్ శాఖ
- కలెక్టర్ ఆమోదంతో త్వరలో గెజిట్ నోటిఫికేషన్

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు(మిర్చియార్డు) పాలకవర్గం చైర్మన్ పీఠాన్ని మళ్లీ ఓసీకే రిజర్వు చేయాలని మార్కెటింగ్ శాఖ ప్రతిపాదించింది. ఏఎంసీల రిజర్వేషన్లను ఖరారు చేయాలని మార్కెటింగ్ కమిషనర్ నుంచి మెమో రావడంతో ఆ శాఖ జిల్లా అధికారులు వివిధ కమిటీలకు రిజర్వేషన్ల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కలెక్టర్ ఆమోదంతో వాటిని గజిట్‌లో ప్రచురించాల్సి ఉన్నది. అయితే ప్రస్తుతం కలెక్టర్ నాగలక్ష్మి కలెక్టర్ల సదస్సు, రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమై ఉండటంతో ఈ వారంతం/వచ్చే వారం దీనిపై దృష్టి పెడతారని అధికారవర్గాలు తెలిపాయి. ఎప్పటిలానే మిర్చియార్డుని ఓసీ(జనరల్)కు రిజర్వు చేయాలని ప్రతిపాదించారు. దీంతో టీడీపీ కూటమిలో చైర్మన్ పదవిని ఆశిస్తున్న నాయకులు తమ వంతు ప్రయత్నాల్లో మునిగిపోయారు.

మిర్చియార్డుకు ప్రపంచ వ్యాప్తంగా పేరు, ప్రఖ్యాతలు ఉండటంతో సహజంగానే ఈ పదవికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. అలానే యార్డులో ఏటా రూ. 10 వేల కోట్లకు పైగా మిర్చి లావాదేవీలు జరుగుతుంటాయి. ఇది కూడా చైర్మన్ పదవికి పోటీ పెరగడానికి మరో కారణం. అధికార పార్టీలో ఎవరికైతే ఎమ్మెల్యే స్థాయి టిక్కెట్‌ని ఎన్నికల్లో ఇవ్వలేకపోయారో అలాంటి వారికి ఈ పదవిని ఇచ్చి సంతృప్తిపరుస్తుంటారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో లేళ్ల అప్పిరెడ్డి, టీడీపీ హయాంలో మన్నవ సుబ్బారావు, వెన్నా సాంబశివారెడ్డి, వైసీపీ పాలనలో చంద్రగిరి ఏసురత్నం, నిమ్మకాయల రాజనారాయణలకు మిర్చియార్డు చైర్మన్ పదవులను ఆయా పార్టీలు ఇచ్చాయి. వీరంతా ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్‌ని ఆశించిన వారే. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నది. ఈ నేపథ్యంలో చైర్మన్ పదవిని టీడీపీ/జనసేన పార్టీల్లో ఎవరో ఒకరికి లభించే అవకాశం ఉన్నది. ఒకవేళ టీడీపీకి చైర్మన్ పదవి లభిస్తే వైస్‌చైర్మన్ పదవిని జనసేనకు ఇస్తారు. అదే జనసేనకు చైర్మన్ పదవి వస్తే మిగతా పాలకపక్షంలో టీడీపీకి ఎక్కువ పదవులు లభిస్తాయి. బీజేపీ నుంచి కూడా ఒకరిద్దరికి కమిటీలో చోటు కల్పించాల్సిన పరిస్థితి ఉన్నది. అయితే రిజర్వేషన్ ప్రక్రియ ఖరారు అయిన తర్వాతనే మూడు పార్టీల నాయకులు కూర్చుని ఒక నిర్ణయం తీసుకొంటారు.

50 శాతం పదవులు మహిళలకే

వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో 50శాతం పదవులు మహిళలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దాంతో ఆ మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు కసరత్తు జరుపుతున్నారు. అలానే ఎస్‌సీలకు 15 శాతం, బీసీలకు 29 శాతం, ఎస్‌టీలకు 6 శాతం రిజర్వేషన్ ఉండేలా చూస్తున్నారు. కలెక్టర్ ఆమోదంతో గుంటూరు జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీలు గుంటూరు, తాడికొండ, మంగళగిరి, దుగ్గిరాల, ప్రత్తిపాడు, తెనాలి, పొన్నూరు, ఫిరంగిపురంలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ని ప్రకటించనున్నారు.



ఎయిమ్స్ రహదారికి సొబగులు

- 17న రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మంగళగిరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్న సందర్భంగా ఎయిమ్స్‌కు వెళ్లే రెండు ప్రధాన రోడ్డు మార్గాలను అధికారులు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మంగళగిరి నగరం వైపు నుంచి ఎయిమ్స్‌లోనికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించారు. ఎయిమ్స్ గేటు వద్ద ఉన్న మట్టిరోడ్డు మార్గాన్ని యుద్ధప్రాతిపదికన బీటీ రోడ్డుగా మార్చివేశారు. ఈ మార్గంలో వెలగని విద్యుద్దీపాల స్థానే కొత్త బల్బులను అమర్చారు. ఇక 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్‌లోకి వచ్చే ప్రధాన రహదారికి కొత్త సొబగులను అద్దేపనిలో పడ్డారు. వడ్డేశ్వరం వద్ద హైవే దిగువన ఉన్న అండర్‌పాస్‌తోపాటు దానికి ఇరువైపులా ఉన్న సర్వీసురోడ్లకు కొత్తగా బీటి లేయర్ వేశారు. ఇప్పటివరకు పట్టించుకోని ఆ మార్గంలోని సెంట్రల్ డివైడర్‌కు గ్రీనరీ హంగులను సమకూరుస్తున్నారు. రోడ్డుకు అటుఇటుగా ఉన్న పిచ్చి మొక్కలను గడ్డిని తొలగించివేస్తున్నారు. అంతేకాదు.. కనకదుర్గా వారధి మీద ఉన్న గుంతలను సైతం పూడ్చివేస్తున్నారు. మొత్తం మీద రాష్ట్రపతి రాకతో ఎయిమ్స్ కు వెళ్లే మార్గాలు సుందరంగా, సౌకర్యవంతంగా మారుతున్నాయి.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పెరగనున్న జనరల్ బోగీలు

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే జంక్షన్ మీదగా రాకపోకలు సాగించే మూడు రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యని దశలవారీగా పెంచాలని రైల్వే శాఖ నిర్ణయించింది. మొదటిదశలో నంబరు. 12706/12705 సికింద్రాబాద్ - గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు జనరల్ బోగీల సంఖ్యని పెంచనున్నారు. దాదాపుగా 4 జనరల్ బోగీలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. రెండోదశలో నంబరు. 12704/12703 సికింద్రాబాద్ - హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, నంబరు. 12755/12756 కాకినాడ పోర్టు - భావనగర్ - కాకినాడ పోర్టు వీక్లీ ఎక్స్‌ప్రెస్, నంబరు. 17211/17212 మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్, నంబరు. 12733/12734 తిరుపతి - లింగంపల్లి - తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లలో జనరల్ బోగీల సంఖ్య పెంచుతారు. వీటిల్లో మూడు చొప్పున జనరల్ బోగీలు పెరిగే అవకాశం ఉన్నది. దీనివలన సాధారణ ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రీడలతో శారీరక దృఢత్వం.. మానసిక ఉల్లాసం

- పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో ఎస్పీ సతీష్ కుమార్



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ | కబడ్డీ పోటీల్లో పోలీస్ క్రీడాకారులు

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటలు, క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీలు-2024ను ప్రారంభించారు. జిల్లా పోలీస్ అధికారులతో కలసి ఆటలు, క్రీడల జెండాను ఎగురవేసి, క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం బందోబస్తు, శాంతిభద్రతల పరిరక్షణ, వీఐపీలు, వీవీఐపీల పర్యటన విధులు, నేరస్తుల అన్వేషణ, రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు అంటూ ఎన్నో విధుల్లో నిమగ్నమై, హడావుడిగా ఉండే పోలీసులకు వారి మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడానికి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధులకు స్వల్ప విరామాన్ని ఇచ్చి వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే విధంగా వారిలోని క్రీడా ప్రతిభను వెలికితీసి, వారి సామర్థ్యాన్ని నిరూపించడానికి ఈ క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడల్లోని క్రమశిక్షణ వ్యక్తులకు జవాబుదారీతనం, బాధ్యతను బోధిస్తుందన్నారు. టీమ్ స్పోర్ట్స్‌లో పాల్గొనడం నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుందన్నారు. ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం, ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి సమిష్టిగా వ్యూహరచన చేయడం ఈ క్రీడల వలన అలవరుచుకుంటారన్నారు. గుంటూరు జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్రీడలు, ఆటల పోటీలు ఈ నెల 13వ తేదీ వరకు జరగనున్నాయని, ఈ పోటీలలో 8 విభాగాల (6 పోలీస్ సబ్‌డివిజన్లు, ఒక ఏఆర్ విభాగం, ఒక - హెడ్ క్వార్టర్ విభాగం) నుండి సుమారు 150మంది క్రీడాకారులు ఆయా పోటీలకు హాజరయ్యారన్నారు. ఈ పోటీల్లో పరుగు పందాలు, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్‌పుట్, షటిల్, టెన్నిస్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడలు, ఆటలకు సంబంధించి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణమూర్తి, సుప్రజ, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

- ఏకగ్రీవానికి సయోధ్య
- చాంబర్ గౌరవాధ్యక్ష పదవికి ఆంజనేయులు
- అధ్యక్ష బరిలో తెరపైకి మాజీ కార్పొరేటర్ యేల్చూరి పేరు

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు సమీపించే కొద్ది వ్యవహారం రసవత్తరంగా మారుతోంది. ప్రతి ఏటా జరగాల్సిన ఎన్నికలు ఈ నెల 28న నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో పలువురు చాంబర్ సభ్యులు, టీడీపీకి చెందిన ఆర్యవైశ్య నాయకులు రంగంలోకి దిగారు. చాంబర్ ఎన్నికలు ఏకగ్రీవం చేసేలా చర్చలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష పదవికి కాకుండా గౌరవాధ్యక్షుడుగా ఆతుకూరి ఆంజనేయులు కొనసాగేలా ఒప్పించినట్లు సమాచారం. అధ్యక్ష స్థానంలో మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు బరిలో నిలుస్తున్నట్లు తెలిసింది. కాగా ఇదే సమయంలో గత ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలైన రంగా బాలకృష్ణ కూడా ఈ దఫా అధ్యక్ష పదవి కోసం విస్తృత ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన వ్యాపారవర్గాల నుంచి మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారు. అయితే , ఎన్నికలు ఏకగ్రీవమయ్యేలా కొందరు ఆర్యవైశ్య నాయకులు రంగంలోకి దిగారు. 34 ఏళ్ళుగా ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తోన్న ఆతుకూరి ఆంజనేయులను ఈ దఫా చాంబర్ గౌరవాధ్యక్షుడుగా నిలిపి ఏకాభిప్రాయంతో మరొకరికి అధ్యక్ష పదవితో ఎన్నికలు ఏకగ్రీవం చేసేందుకు కొందరు ఆర్యవైశ్య నాయకులు సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తున్నారు. బరిలో ఉన్న వారు వెనక్కి తగ్గుతారా లేదా అనేది వేచి చూడాలి.

13న జాబ్‌మేళా

గుంటూరు(విద్య),డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. తెనాలిలోని ఐటీఐ కళాశాల, నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది నుంచి పీజీ వరకు విద్యార్హత ఉన్న 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉన్న యువతీయువకులు అర్హులని తెలిపారు. బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

రాజధాని రైతులకు ఈ-లాటరీ నేడు

తుళ్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతులకు ప్రత్యామ్నాయంగా అప్పగించే ప్లాట్లకు ఈనెల 12న గురువారం 'ఈ-లాటరీ' నిర్వహిస్తున్నట్లు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ప్రధాన కార్యాలయంలో 'ఈ-లాటరీ' జరుగుతుందని తెలిపారు. అమరావతి ప్రాంతంలోని 14 గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్టు తెలిపారు. నవులూరు 1, 2 కురగల్లు 1, 2 నిడమర్రు 1, 1 రాయపూడి 1, 2 లింగాయపాలెం, మల్కాపురం, నెక్కల్లు, శాఖమూరు, తుళ్లూరు 1, 2 వెలగపూడి, మందడం 1, 2 అనంతవరం, ఐనవోలు తదితర గ్రామాల్లో సంబంధిత రైతులు హాజరుకావాలని సూచించారు.



బుధవారం రాత్రి విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న పల్నాడు జిల్లా చిలకలూరిపేట బైపాస్ రోడ్డు. వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో 16.4 కి.మీ. పొడవున నిర్మించిన దేశంలోనే మొట్టమొదటి ఈ మోడల్ బైపాస్ రోడ్డుపై గతవారం రాకపోకలు ప్రారంభమయ్యాయి. విద్యుత్ అవసరాల కోసం ఒక మెగావాట్ విద్యుత్ ప్లాంట్‌ను కూడా నేషనల్ హైవే సంస్థ రోడ్డు పక్కన ఏర్పాటుచేసింది.

- (ఆంధ్రజ్యోతి) చిలకలూరిపేట

రైలు ప్రయాణం.. నరకం



(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్నం 3, 4 గంటలకు విజయవాడ చేరుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు. సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ కూడా ఈ వారంలో రెండురోజులు గంటన్నర ఆలస్యంగా నడిచింది. సూపర్‌ఫాస్ట్ రైళ్లు కూడా ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. నరసాపురం నుంచి వచ్చే రైళ్లు, కాకినాడ నుంచి ముంబై వెళ్లే లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ కూడా గుంటూరుకు గంటకుపైగా ఆలస్యంగా వస్తున్నాయి. విజయవాడ నుంచి జిల్లాలోని తెనాలి, నిడుబ్రోలు, బాపట్లను కలుపుతూ చీరాల, ఒంగోలు మీదగా వెళ్లే రైళ్లు చాలా ఆలస్యంగా వెళుతున్నాయి. వంద కి.మీ దూరం ఉన్న చీరాల- విజయవాడ ప్రయాణం సగటున 4 నుంచి 7 గంటల వరకూ సమయం పడుతోంది. ఈ రూటులో ఇప్పటికే అనేక పాసింజర్ రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. ఉన్న రైళ్లను కూడా ఆలస్యంగా నడుపుతోంది. ఈ రూటులో నడిచే పాసింజర్ రైళ్లు ప్రతిరోజూ సగటున గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. క్రిష్ణాఎక్స్‌ప్రెస్ కూడా గంటకు తక్కువ కాకుండా ఆలస్యంగా నడుస్తున్నది. విజయవాడ- గూడూరు పాసింజర్ పరిస్థితి అసలు చెప్పడానికే వీలు లేదు. ఈ రైలు విజయవాడకు చేరే వరకూ నమ్మకం లేని పరిస్థితి.

నాడు రైళ్లు రద్దు.. నేడు ఆలస్యం

2020లో కరోనా వంకతో జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్ పేరు చెప్పి రైల్వేశాఖ దేశవ్యాప్తంగా రైళ్లను అర్ధాంతరంగా రద్దుచేసింది. ఆ తర్వాత రెండు నెలలకు రైళ్లను పునరుద్ధరిస్తున్నామని చెప్పినా సాధారణ ప్రయాణికులు ప్రయాణించే పాసింజర్ రైళ్లను మాత్రం పునరుద్ధరించలేదు. కేవలం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మాత్రమే నడిపింది. ప్రయాణికుల నుంచి ఒత్తిడి పెరగడంతో స్పెషల్ రైళ్ల పేరుతో పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ చార్జీలతో తిరిగి తీసుకువచ్చింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టికెట్ ధరలు తగ్గించినా రైళ్లను మాత్రం స్పెషల్ రైళ్లుగానే నడుపుతోంది. రద్దయిన రైళ్లను మాత్రం తిరిగి పునరుద్ధరించలేదు. పైపెచ్చు అనేక గ్రామాల్లో స్టాపులను కూడా తొలగించేశారు. కాగా 2024 ఏడాది మొత్తం అభివృద్ధి పనుల పేరుతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తిరిగే స్పెషల్ రైళ్లను, సింహాద్రి, గోల్కొండ వంటి సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రైల్వే శాఖ నెలల తరబడి రద్దుచేసింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రత్యేకించి సీజన్ ప్రయాణికులైన ఉద్యోగులు, గుంటూరు, విజయవాడల్లో పనులకోసం వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నగిషీలకు ప్రాధాన్యం..

రెండు మూడేళ్లుగా రైల్వే శాఖ రైల్వే స్టేషన్ల ఆధునికీకరణపై దృష్టి సారించింది. వందల కోట్లు ఖర్చు చేసి రైల్వే స్టేషన్లను అత్యాధునికంగా తీర్చిదిద్దుతోంది. అందమైన చిత్రమాలికలు, విగ్రహాలు, నగిషీలతో చక్కగా తీర్చిదిద్దుతోంది. కానీ రైళ్ల గురించి పట్టించుకోవడంలేదు. రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణపై దృష్టి సారించడంలేదు. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా రైళ్లను ఏర్పాటు చేయడంలేదు. వందలకోట్లు ఖర్చు చేసి స్టేషన్లను అభివృద్ధి చేసే బదులు రైళ్లను పునరుద్ధరించి, ప్రయాణ నాణ్యతను పెంచవచ్చు కదా అంటూ ప్రయాణికులు వాపోతున్నారు.

పొమ్మనకుండానే పొగ..

రైల్వే శాఖకు సరుకు రవాణా రైళ్లే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. ప్రయాణికుల రైళ్ల కంటే గూడ్స్ రైళ్లపై వచ్చే ఆదాయం ఎక్కువ కావడంతో పాసింజర్ రైళ్లు తగ్గించాలని గతం నుంచి ప్రభుత్వాలు భావిస్తూ వస్తున్నాయి. అయితే రైల్వే అనేది సేవా దృక్పథంతో ఏర్పాటు చేసింది కాబట్టి గత ప్రభుత్వాలు అంత ధైర్యం చేయలేకపోయాయి. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో భిన్నంగా వ్యవహరిస్తోంది. రైళ్లను రద్దు చేయడం, ప్రయాణంలో అంతరాయాలు కల్పించడం ద్వారా ప్రయాణికులే దూరమయ్యేలా చేస్తోందని పలువురు విమర్శలు చేస్తున్నారు. రైల్వే శాఖ తీరు కూడా గత కొంతకాలంగా అలానే ఉంటోంది. ఇప్పటికైనా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రైళ్లను పునరుద్ధరించి, సకాలంలో నడిపి సగటు ప్రయాణికుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాలలో మిర్చి పంట పరిశీలన

చిలకలూరిపేట డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం పోతవరం, రాజాపేట గ్రామాలలోని మిరప పంట పొలాలను ఉద్యాన శాఖ స్థానిక అధికారి వి.విశాల్ బుధవారం పరిశీలించారు. నల్ల తామర, తెల్లనల్లి, తెల్లదోమ, పెనుబంక పురుగుల నివారణకు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆయన ఈ సందర్భంగా వివరించారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

యడ్లపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు అపహరించుకెళ్ళాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సందెపూడి గ్రామానికి చెందిన 90ఏళ్ల వృద్ధురాలు ఊటుకూరి అనసూయమ్మ ఇద్దరు కుమారులతో కలసి నివాసం ఉంటోంది. బుధవారం ఉదయం ఇద్దరు కుమారులు పనులపై బయటకు వెళ్ళారు. మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో మంచంపై ఒంటరిగా కూర్చుని ఉన్న వృద్ధురాలి వద్దకు వెళ్ళి మెడలోని 3సవర్ల బంగారు గొలుసును లాక్కున్నాడు. దీనితో వృద్ధురాలు పెద్దగా కేకలు వేయడంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామ సభలతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ముఖ్యంగా ఫ్రీ హోల్డ్, మ్యుటేషన్, 22ఏ, డీకేటీ, రీ సర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై వినతులు స్వీకరించి బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని రెవెన్యూ అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి భూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అధికారులు రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

మాజీ మంత్రి విడదల రజిని అక్రమాలపై
సమగ్ర విచారణకు డిమాండ్

చిలకలూరిపేట డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి విడదల రజిని అక్రమాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో కన్వీనర్ పెంటేల బాలాజీ డిమాండ్ చేశారు. బుధవారం బాలాజీ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో చిలకలూరిపేట చరిత్రలోనే ఎన్నడూ జరగనంత అవినీతి విడదల రజిని పాలన కాలంలో చోటు చేసుకుందని విమర్శించారు.

రేపు రెడ్ క్రాస్ బ్లడ్ కేంద్రం ప్రారంభం

నరసరావుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు లింగం గుంట్ల ప్రభుత్వ వైద్యశాల మూడో ఫ్లోర్లో ఈ నెల 13న రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్ రెడ్డి బుధవారం తెలిపారు. పల్నాడు జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్ బాబులు బ్లడ్‌సెంటర్‌ను ప్రారంభిస్తారన్నారు.

పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

రొంపిచర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొంపిచర్ల పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ నాగేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. మండలంలో నేరాల గురించి ఎస్ఐ అశోక్‌ను అడిగి తెలుసుకున్నారు. హైవే పై ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామకృష్ణ, పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై ఎంపీడీవో సమీక్ష

వినుకొండ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బూసిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బూసిరెడ్డి మాట్లడుతూ గ్రామాల్లో మృతిచెందిన వారిని గుర్తించి జాబ్‌కార్డులు తొలగించాలని, కొత్తవారికి జాబ్‌కార్డు ఏర్పాటుచేసి ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ఇంటి నిర్మాణం చేపడుతున్న యజమానులకు 90 రోజులు పని దినాలకు మస్టర్ పేమెంట్ చెల్లించాలని సిబ్బందిని ఆదేశించారు. పండ్ల తోటలు వేసిన రైతులకు వాచ్ అండ్ వార్డు పేమెంట్ చేయాలని ఏపీవో టీఏలను సూచించారు. కార్యక్రమంలో ఏపీవో కట్టా నాగేశ్వరరావు, టెక్నికల్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతోనే బీమా వర్తింపు: ఏడీఏ

పిచికలపాలెం (శావల్యాపురం) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంటకోత ప్రయోగాల ద్వారా వచ్చే దిగుబడుల ఆధారంగానే ప్రభుత్వం రైతులకు పంటల బీమా పథకాన్ని వర్తింపజేస్తుందని వినుకొండ వ్యవసాయ సంచాలకులు బోయపాటి రవిబాబు అన్నారు. మండలంలోని పిచికలపాలెంలో వరి, మొక్కజొన్న పంటల్లో బుధవారం పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన దారపనేని చెన్నకేశవులుకు చెందిన వరి పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించగా ఎకరాకు 36బస్తాలు, దుగ్గెంపూడి సుశీల, ఆంజనేయులుకు చెందిన మొక్కజొన్న పొలాల్లో పంటకోత ప్రయోగాలు నిర్వహించగా ఎకరాకు 26 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయని ఏడీఏ రవిబాబు తెలిపారు. కార్యక్రమంలో డీఏవో కార్యాలయం ఏఎస్‌వో మధుసూదన్‌రావు, ఏఈవో పూరేటి అశోక, వీపీఏ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



సిమెంటు రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు

అస్తవ్యస్తంగా మురుగు నీటి పారుదల

నరసరావుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోంది. అరండల్ పేటలో ప్రధాన రహదారిపై నిత్యం మురుగునీరు ప్రవహిస్తోంది. మురుగు కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో కాలువల్లో పూడికతీసే పరిస్థితి లేదు. దీంతో కాలువలు పూడిపోయి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. చర్యలు తీసుకోవాల్సిన పురపాలకులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. వరద నీటి కాలువలకు కూడా ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి. మురుగునీటి సమస్యలను పరిష్కారించే అవకాశం ఉన్నా ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. రూ.69కోట్ల వ్యయంతో నిర్మించిన భూగర్భ డ్రైనేజ్‌ను వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికైనా యూజీడీని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తే మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు

● ఆర్డీవో కే మధులత

నూజెండ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభల ద్వారా భూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్టు నరసరావుపేట ఆర్డీవో కే మధులత తెలిపారు. బుధవారం మండలంలోని ముక్కెళ్ళపాడులో జరిగిన రెవెన్యూ గ్రామ సభలో ఆర్డీవో కే మధులత పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధులత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభల్లో పాల్గొని రెవెన్యూ సమస్యలు ఉన్నవారు పరిష్కరించుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సాధక బాధలను అర్థం చేసుకొని మెరుగైన పరిష్కార మార్గాలను సూచించాలన్నారు. రెవెన్యూ గ్రామ సభలో ముక్కెళ్ళపాడు సర్పంచ్ సింగంశెట్టి బాల వెంకటప్రసాదు తమ గ్రామంలో ఎస్సీలకు గతంలో పట్టాలు ఇచ్చి పొజిషన్ చూపించకపోవటంపై వారు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారికి కేటాయించిన భూముల్లో వారు సాగు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సభలో అధికారులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా చుక్కల భూములు, డీకే భూములు ఉన్న రైతులకు నడికూడి-శ్రీకాళహస్తి నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణానికి సేకరించిన భూమి తాలూకు పరిహారం నేటికీ అందలేదని


ముక్కెళ్ళపాడు రెవెన్యూ గ్రామ సభలో రైతుల సమస్యలను తెలుసుకుంటున్న ఆర్డీవో కే మధులత

ఫిర్యాదుచేశారు. మాజీ సైనిక ఉద్యోగులకు కేటాయించిన భూములను సర్వే చేయించి ఆన్‌లైన్ చేయాలని మాజీ సైనిక ఉద్యోగులు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ రమేష్‌కుమార్, మండల సర్వేయర్ చండీరాణి, వీఆర్‌వోలు జ్యోతి, ఆనంద్, కొత్త జెడ్డవారిపాలెం సర్పంచ్ జీ పున్నారావు, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: మండలంలోని వెంకుపాలెం, నరగాయపాలెం గ్రామాల్లో డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు ఆధ్వర్యంలో మండలంలోని వెంకుపాలెం, నరగాయపాలెం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా నరగాయపాలెంలో 8, వెంకుపాలెంలో 3 అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించి సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరులో బుధవారం ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు హాజరయ్యారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం మార్కెట్ యార్డులో రైతులు ధాన్యాన్ని 17శాతం నెమ్ములేకుండా రూ.1740కు కొనుగోలు చేయటం జరుగుతుందని, రైతులు నేరుగా ఆన్‌లైన్ చేసుకున్నట్లయితే దళారులు వద్దకు వెళ్ళకుండా యార్డులో విక్రయించుకునే సౌకర్యం కల్పిస్తోందని, రెండు రోజుల్లోనే రైతు అకౌంట్‌లో డబ్బులు జమ చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ సుధాకర్, ఆర్ఐ నరసింహారావు, వీఆర్‌వో రవినాయక్, మాజీ సర్పంచ్ అర్వపల్లి నరసింహారావు, టీడీపీ నాయకులు పెంటాల వెంకటేశ్వర్లు, బొట్లగుంట్ల నాగేశ్వరరావు, అర్ధలపూడి వెంకట నారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసదుపాయాలు కల్పించాలి

● ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రజా సంఘాల నాయకులు పట్టణంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసీయూ ప్రారంభించకపోవడం వలన సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు వైద్యం అందడం లేదన్నారు. అదేవిధంగా రోగులకు సరైన మందులు ఇవ్వకుండా వైద్య సిబ్బంది మందులు బయటకి రాస్తున్నారని, ఈ విధానాలు మానుకొని ప్రభుత్వం రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఇక్కడ వైద్యులు సిబ్బంది సరైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడలేని స్థితిలో ఉన్నారని, ప్రతి రోగిని గుంటూరు జీజీహెచ్‌కి రిఫర్ చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు వీ కోటనాయక్, పీడీఎం నాయకుడు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, షేక్ మస్తాన్‌వలి, జీ రామకృష్ణ, బీసీ సంఘం నాయకుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన

నరసరావుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సైబర్ క్రైమ్ ఇండియా కౌన్సిలర్ కొత్తపల్లి ప్రదీప్ మాట్లాడుతూ ఏ సందర్భంలోనూ ఓటీపీని పంచుకోవద్దని అన్నారు. 1930 సైబర్ క్రైమ్ పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డీనేటర్ డాక్టర్ బండ్ల రవితేజ, కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాద్‌రావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చేగు కార్తీక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ విజేత వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ మహిళల బాస్కెట్‌బాల్ విజేతగా స్థానిక వాగ్దేవి డిగ్రీ కళాశాల నిలిచిందని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాదు బుధవారం తెలిపారు. ఈ నెల 6, 7 తేదీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. డిసెంబరు 20 నుంచి 23 వరకు కేరళ కొట్టాయంలోని మహాత్మాగాంధీ యూనివర్శిటీలో జరిగే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో విశ్వవిద్యాలయం మహిళల జట్టుకు సీహెచ్ సిందూర, డీ అమూల్య, ఎస్ దిల్ అఫ్రోజ్‌లు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. యూనివర్శిటీ జట్టుకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



విజేతలుగా నిలిచిన వాగ్దేవి మహిళల బాస్కెట్‌బాల్ జట్టు

15న నవోదయ ప్రవేశ పరీక్షలకు నమూనా టెస్ట్

వినుకొండటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్ధార్థనగర్‌లోని గీతమ్స్ హైస్కూల్‌లో ఈ నెల 15వ తేదీన ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నవోదయ ప్రవేశ పరీక్ష, మోడల్ గ్రాండ్ టెస్టు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ యం.కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినీ, విద్యార్థులు నవోదయ మోడల్ టెస్టు పరీక్షలు పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా విద్యార్థులు సెల్:7013800787,6304491025ల నెంబర్లను సంప్రదించి ఈ నెల 14వ తేదీన పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఆలయ పునఃనిర్మాణం కోసం విరాళం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటబజార్ పులుపులవారి వీధిలోని వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయం నిర్మాణం కోసం నరసరావుపేటకు చెందిన వాసవి స్టీల్స్ అధినేత చిలకల రామకృష్ణ రూ.5,01,116 దేవాలయ నిర్మాణానికి అందజేస్తానని ప్రకటించారు. అందులో భాగంగా బుధవారం రూ.1,01,116 అందించారు.

కొండ్రముట్లలో ఘనంగా విగ్రహాల పునఃప్రతిష్ఠ

ఈపూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రముట్లలో బుధవారం కోదండరామస్వామి ఆలయ, విగ్రహాల పునఃప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కోదండరామస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి, గణపతి, దాసాంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేశారు.


కొండ్రముట్లలో పూజలు చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మక్కెన

ఘనంగా సెమీ క్రిస్మస్

వినుకొండ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని మతాలను సమానంగా గౌరవించి పేదలు ఆకలి తీర్చే పార్టీ తెలుగు దేశం పార్టీ అని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక వెల్లటూరు రోడ్డులోని ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సెమీక్రిస్మస్ వేడుకల్లో బుధవారం ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట శాంతి నిలయం పాస్టర్ క్రిష్టఫర్ క్రీస్తు శాంతి సందేశాన్ని అందజేశారు. అనంతరం జీవీతోపాటు మక్కెనను నియోజకవర్గ పాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.


సెమీక్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్‌చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, మక్కెన తదితరులు

ట్రాక్టర్లు, డ్రోన్లు ఇప్పిస్తామని మోసం...
జేసీ, ఎమ్మెల్యేకు గోనెపూడి వాసుల ఫిర్యాదు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌లు, డ్రోన్‌లు ఇప్పిస్తామని పగడాల అనిల్ కుమార్ రూ.30లక్షలు మోసం చేశాడని గోనెపూడి వాసుల ఫిర్యాదు చేశారు. బుధవారం పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే 32వ వార్డులో పర్యటిస్తున్న సందర్భంలో కలిసి ఈ ఫిర్యాదు చేశారు. పగడాల అనిల్ మొత్తం రూ.2కోట్లు పైగా వసూలు చేశాడన్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. బాధితుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదు తీసుకొని విచారణ చేస్తామని బాధితులకు జాయింట్ కలెక్టర్ సూరజ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుంకర బాలకోటమ్మ, నాగేశ్వరరావు, రామయ్య, లక్ష్మీదేవి, చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జేసీ, ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

కే-రిడ్జి స్కూల్‌లో పోలిగాట్ కాన్ఫరెన్స్


కార్యక్రమంలో పాల్గొన్న పూలబాల వెంకట్, చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, విద్యార్థులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేటలోని కే-రిడ్జి స్కూల్‌లో బుధవారం పోలిగాట్ కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. విశిష్ట అతిథిగా పూలబాల వెంకట్ పాల్గొని వివిధ భాషలు నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. కే-రిడ్జి స్కూల్‌లో విదేశీ భాషలు నేర్పించడం గొప్ప విషయం అన్నారు. చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, కోమటినేని నాసరయ్య విద్యార్థుల ప్రతిభను ప్రసంశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రికోశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 11: (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. 16న ఆరుద్ర నక్షత్రం సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో విచ్చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సమీక్షించారు.

వనరుల సద్వినియోగంతో సుస్థిరాభివృద్ధి: ఎంపీడీవో

యడ్లపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజోతి): ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని, అప్పుడే సుస్థిర అభివృద్ధి సాధించగలమని ఎంపీడీవో హేమలత అన్నారు. రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శిక్షణ సంస్థల ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న తొలివిడత శిక్షణ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. శిక్షణ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జాకీర్‌హుస్సేన్, పంచాయితీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయితీరాజ్, గృహ నిర్మాణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మిర్చి పంటలో తెగులు నివారణపై రైతులకు అవగాహన

వినుకొండ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులపాడు, నీలగంగవరం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి కొంకాయల అంజిరెడ్డి బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిరప పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ పురుషోత్తమ్‌రెడ్డి, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

మొక్క జొన్న పంటను పరిశీలించిన ఏవో శివ లలిత

రొంపిచర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బయ్యపాలెం, తురుమెళ్ళ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో శివ లలిత మాట్లాడుతూ వరిలో మానుకాయ నివారణకు మోనోకాజబ్, కార్బన్‌డైజమ్ పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంటూరి వెంకట ప్రసాదు, గ్రామ పెద్దలు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో కే మాధవీలత

బీసీ హాస్టల్‌లో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

నూజెండ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల బీసీ బాలుర వసతి గృహాన్ని నరసరావుపేట ఆర్డీవో కే మాధవీలత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ గదులు నివసించేందుకు సౌకర్యంగా లేకపోవటం, మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటం, ప్రహరీ లేకపోవటాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు జిల్లా ఉన్నతాధికారులకు తెలియ జేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు, వీఆర్‌వో నాసర్ సాహెబ్ తదితరులు ఉన్నారు.

పార్టీ సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మంగా తీసుకోవాలి


● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ నేతలంతా ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఇచ్చిన లక్ష్యాన్ని త్వరగా పూర్తిచేయాలని పార్టీ నేతలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. బుధవారం తన నివాసంలో జరిగిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని రెండు సంవత్సరాల పాటు కల్పిస్తున్న విషయాన్ని పార్టీ శ్రేణులు ప్రజలకు తెలియజేస్తే మరింతమంది క్రియాశీలక సభ్యులుగా పార్టీలో చేరతారన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని, త్వరలో ప్రభుత్వం ఇవ్వనున్న కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, హౌసింగ్ పథకం వంటి పథకాలు సామాన్య ప్రజలు ఆశించేలా అర్హులైన పేదవారికి అందేలా పార్టీ శ్రేణులు పని చేయాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి షేక్ కరిముల్లా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్ఎస్ సుభానీ, యడ్లపాడు, నాదెండ్ల, పేట మండలాల అధ్యక్షులు జవ్వాజి మదన్, బి.సత్యనారాయణ, కామినేని సాయిబాబా వీరితో పాటు గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల రమణ, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

గణపవరంలో ఇష్టానుసారం చెట్ల నరికివేత

నాదెండ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలోని మెయిన్ రోడ్డులో ఇష్టానుసారంగా చెట్ల కొమ్మలను నరికివేశారు. స్థానికంగా ఉన్న ఒక కంపెనీ యాజమాన్యం ఈ చెట్లను నరికినట్టు తెలియ వచ్చింది. రెండు దశాబ్దాలుగా ఈ రహదారిలో డివైడర్ ఏర్పాటు చేసి మొక్కలను పెంచటంతో పాటు రోడ్డుకు ఇరువైపులా చెట్లను పెంచారు. పంచాయతీ వారే చెట్లను పెంచేందుకు నీరుపోశారు. గ్రామంలో ఉన్న పరిశ్రమల కాలుష్యం నుంచి ప్రజలను రక్షించేందుకు చెట్లను పెంచే ప్రయత్నం చేశారు. కాగా ఆ చెట్లను నరకటంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి మారుతీ బాబు మిగిలిన చెట్లను నరకకుండా అడ్డుకున్నారు.


గణపవరం మెయిన్ రోడ్డులో నరికిన చెట్లు


రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబు ప్రభుత్వంలో బీసీలకు న్యాయం

● రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్

జాలాది (యడ్లపాడు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రభుత్వంలోనే బీసీలకు తగిన న్యాయం జరుగుతుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ అన్నారు. యడ్లపాడు మండలం జాలాది గ్రామానికి చెందిన గుంటుపల్లి కోటేశ్వరరావు ఆహ్వానం మేరకు గ్రామానికి వచ్చిన ఆయనను మండల టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతుతూ బీసీలు తెలుగుదేశం పార్టీకి వెన్నెముక అన్నారు. కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు తప్పక ఉంటుందని, కష్టపడిన వారికి చంద్రబాబు తప్పక న్యాయం చేస్తారన్నారు. మాజీ ఎంపీపీ కందిమళ్ళ రఘురామారావు మాట్లాడుతూ బీసీల ఆర్థికాభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, వారికోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ వాలీబాల్ జట్టుకు కృష్ణవేణి విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఏఎన్‌యూ జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ నెల 18 నుంచి 22 వరకు కేరళ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఏఎన్‌యూ జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఏఎన్‌యూ జట్టుకు ఎంపికైన ఏ ఉమామహేశ్వరరావు, జె నితిన్ కిరణ్, జె కళ్యాణ్ కుమార్, పీ సాహిత్‌సింగ్‌లను డైరెక్టర్ కే నాసరయ్య, కే వీరరాఘవులు, పీడీ ఈదర ఆదిబాబు, మహమ్మద్ అభినందించారు. చోడవరం ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలలో ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహించిన ఏఎన్‌యూ అంతర కళాశాలల వాలీబాల్ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచిందని తెలిపారు.


విజేతలైన వాలీబాల్ జట్టుతో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ధనలక్ష్మి కళాశాల విద్యార్థులు

ఈపూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థులు సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు తెలిపారు. ఈ నెల 9, 10 తేదీలలో ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన అంతర కళాశాలల పోటీల్లో పాల్గొని ఎస్కే సుమన్, ఎస్కే కలాముద్దీన్‌లు ప్రతిభ కనబరిచి ఈ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, సీహెచ్ అరవింద్, ఎం.దాస్, కే వంశీలు అభినందించారు.


ఎస్కే సుమన్, ఎస్కే కలాముద్దీన్

సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలి: డీఎల్‌డీవో

నూజెండ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని డీఎల్‌డీవో ఎం వెంకటరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న సీపీడీపీ - బీపీడీపీ 2025 - 26 రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక చొరవచూపి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీ ఉమాదేవి పాల్గొన్నారు.